మీ ఆత్మీయులలో...స్నేహితులలో...
సన్నిహితులలో... ఎవరికైనా... ఎలాంటి
శుభ సందర్భమైనా
మీ హృదయపూర్వక
శుభాకాంక్షలు...
విజయభాను ద్వారా
అందించండి!
విజయభాను
# 9-3-17, PITHAPURAM COLONY , VISAKHAPATNAM-530 003
❖ Phone : 2564353, Fax : 0891-2569004

# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 12-08-2021 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 285 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కోవిడ్ నివారణ, డిజిటల్ హెల్త్‌పై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: రాష్ట్రంలో కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. టీచర్లు సహా, స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి వ్యాక్సినేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలు యూనిట్‌గా పరిగణలోకి తీసుకుని వ్యాక్సినేషన్ ఇవ్వాలని తెలిపారు. దీనివల్ల క్రమబద్ధంగా, ప్రాధాన్యత పరంగా వ్యాక్సినేషన్ ఇచ్చినట్టు అవుతుందని, తద్వారా వ్యాక్సిన్లు వృధా కాకుండా మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. 18 నుంచి 44 ఏళ్ల మధ్యనున్న వారికి కూడా వ్యాక్సిన్లు ఇవ్వాలి కాబట్టి దీనిపై కార్యాచరణ రూపొందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఎక్కువ ప్రజా బాహుళ్యంతో సంబంధాలు ఉన్నవారు, ఉద్యోగులు, సిబ్బందికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దిశగా ఆలోచనలు చేయాలని ఆయన చెప్పారు.

**డిజిటల్ హెల్త్‌పై సమీక్ష**

అనంతరం డిజిటల్ హెల్త్‌పై సమీక్షించిన సీఎం.. ఆరోగ్యశ్రీ కార్డులో కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలు క్యూఆర్ కోడ్ రూపంలో అందుబాటులో ఉండాలన్నారు. విలేజ్ క్లీనిక్స్‌లో కూడా డేటా వివరాల నమోదుతో పాటు ప్రతి విలేజ్, వార్డు క్లీనిక్స్‌లో కూడా కంప్యూటర్ ఉండాలని అధికారులను ఆదేశించారు. విలేజ్ క్లీనిక్స్‌లో సాధారణ పరీక్షలు చేసే పరిస్థితి రావాలని, షుగర్, బీపీ, బ్లడ్ గ్రూప్ సహా ఇతర వివరాలు కార్డులో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో కుటుంబానికి కాకుండా విడివిడిగా వ్యక్తుల పేరుపై ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు.

ఆరోగ్యశ్రీ, ఆధార్ నెంబర్ చెప్పినా వెంటనే ఆరోగ్య వివరాలు వచ్చే విధానం తీసుకురావాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. తల్లులు, పిల్లల ఆరోగ్యంపై విలేజ్ క్లీనిక్స్ దృష్టిపెడుతున్నాయి, అదే క్రమంలో గ్రామాల్లో కాలుష్య నియంత్రణపై కూడా దృష్టిపెట్టాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల పరిస్థితులపై పర్యవేక్షణ చేయాలని, ఈ క్రమంలోనే విలేజ్ క్లీనిక్స్ నుంచి టీచింగ్ ఆస్పత్రుల్లో రిక్రూట్‌మెంట్‌పై దృష్టిపెట్టాలని సీఎం పేర్కొన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని రిక్రూట్‌మెంట్ చేయాలని, మూడు నెలల్లో సిబ్బంది భర్తీ ప్రక్రియ పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పీహెచ్‌సీ నుంచి పైస్థాయి ఆస్పత్రులకు కూడా కాంపౌండ్‌వాల్ ఉండాలని తెలిపారు.

## శ్రీవారికి ప్రథమ సేవకుడిగా రెండోసారి అవకాశం..

### టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం



తిరుమల: టిటిడి ధర్మకర్తల మండలి చైర్మన్గా వైవీ సుబ్బారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ.. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రథమ సేవకుడిగా రెండో సారి అవకాశం రావడం తన పూర్వజన్మ అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గత రెండేళ్లుగా సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ.. మెరుగైన సౌకర్యాలు కల్పించామని ఆయన తెలిపారు. సామాన్య భక్తులకు శీఘ్రంగా స్వామి వారి దర్శనం కల్పించడంలో విజయవంతం అయ్యామని అన్నారు.

తిరుమలలో చారిత్రాత్మక నిర్ణయాలు, మార్పులు తీసుకు రావడంతో పాటు వాటిని అమలు చేసామని ఆయన పేర్కొన్నారు. కరోనా మహమ్మారి కారణంగా ప్రజలంతా ఇబ్బందులకు గురి అవుతున్న సమయంలో దర్శనాలు కూడా కుదించాల్సి వచ్చిందని వైవీ

తరువాయి 2లో..



టీటీడీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు మాతృమూర్తి పిచ్చమ్మ పాదలకు నమస్కారం చేసి ఆశీర్వచనం తీసుకున్న వైవి సుబ్బారెడ్డి దంపతులు.



దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ 25 గిర్ గోవులను, 13 ఆవు దూడలను శ్రీ వెంకటేశ్వర గోశాలకు విరాళంగా టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సమక్షంలో ఇవ్వడం జరిగింది. అలానే అప్పుడే పుట్టిన ఆవుదూడను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యావిధానంలో చేసిన మార్పులు, సంస్కరణలు దేశానికే తలమానికం

### రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



నూజివీడు: మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యాలయాల్లో ఉన్న కోర్సులను మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆయన బుధవారం నూజివీడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో డిగ్రీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్థులతో 'ఇంటర్న్ షిప్'ని చేయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు.

గడిచిన రెండేళ్లలో విద్యావిధానంలో చేసిన మార్పులు, సంస్కరణలు దేశానికే తలమానికంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీ వ్యవస్థను కార్పొరేట్ విద్యా సంస్థలు నిర్వీర్యం చేశాయని పేర్కొన్నారు. నూజివీడులో ఉన్న పోస్ట్ గ్రాడ్యుయెట్ సెంటర్‌ను అటామనస్ ఇనిస్టిట్యూట్‌గా గుర్తించి యూనివర్సిటీతో సంబంధం లేకుండా స్వయం ప్రతిపత్తి హోదాతో అభివృద్ధి చేయాలని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు.

## సీఎం జగన్‌ను కలిసిన భారత మహిళా హాకీ ప్లేయర్ రజనీ

### హాకీ ప్లేయర్ రజనీకి రూ.25 లక్షల నగదు ప్రోత్సాహకం

### కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

### ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటన



అమరావతి: ఒలింపిక్స్‌లో విశేష ప్రతిభ చూపిన భారత మహిళల జట్టు హాకీ క్రీడాకారిణి.. ఏపీకి చెందిన ఇ.రజనీ బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఎం జగన్ రజనీకి పలు ప్రోత్సాహకాలు ప్రకటించారు. రూ. 25లక్షల నగదుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

క్యాంపు కార్యాలయంలో తల్లిదండ్రులతో కలిసి రజనీ సీఎం జగన్‌ను కలిశారు. రజనీని ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించి అనంతరం ఆమెకు జ్ఞాపికను బహూకరించారు. గత ప్రభుత్వంలో రజనీకి ప్రకటించి.. పెండింగ్‌లో ఉంచిన బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిలో 1000 గజాల నివాస స్థలం, నెలకు రూ. 40 వేల చొప్పున ఇన్సెంటివ్‌లు కూడా ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.

రజనీ స్వగ్రామం

తరువాయి 2లో..

## ఇసుక కొరత లేకుండా చర్యలు



అనంతపురం: ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కచ్చితంగా కార్యాలయాల్లో ఉండాలని అన్నారు. పేదలకు 1.28 లక్షల ఇళ్లు అనంతపురం జిల్లాలో నిర్మిస్తున్నామని తెలిపారు.




## అనర్హతకు ఖచ్చితమైన గడువు పెట్టాలి

### న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజుకు వైఎస్సార్సీ ఎంపీల విజ్ఞప్తి



న్యూఢిల్లీ : పార్టీ ఫిరాయింపులకు పాల్పడే సభ్యులపై అనర్హత వేటు వేయడానికి కచ్చితమైన గడువు విధించేలా రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు సవరణ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజుజుకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్సీ పార్లమెంటరీ పార్టీ నాయకులు వి.విజయసాయి రెడ్డి నాయకత్వంలో పార్టీ ఎంపీలు బుధవారం మంత్రి కిరణ్ రిజుజును ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో శ్రీ విజయసాయి రెడ్డి మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తుపై చట్ట సభలకు ఎన్నికైన ఏ ప్రజాప్రతినిధి కూడా ప్రజా తీర్పుకు విరుద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరచకుండా ఆ సభ్యుడిపై అనర్హత వేటు వేసేందుకు వీలుగా 35 ఏళ్ళ క్రితం రాజ్యాంగంలోని పదవ షెడ్యూలును సవరించి పార్టీ ఫిరాయింపుల చట్టానికి రూపు కల్పన చేయడం జరిగింది. అయితే ఏ లక్ష్యంతోనైతే ఈ చట్టం అమలులోకి వచ్చిందో ఆ లక్ష్యం ఇప్పటి వరకు నెరవేరలేదు. అందుకు ప్రధాన కారణం అనర్హత పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోవడానికి నిర్దిష్టమైన గడువును చట్టంలో స్పష్టంగా పేర్కొనకపోవడం అని ఆయన మంత్రికి వివరించారు. చట్టంలోని

తరువాయి 2లో..

# దిశా యాప్ మీ ఫోన్లో ఉంటే మీకు రక్షణ

## రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం




శ్రీకాకుళం : దిశా ఏప్ మీ ఫోన్లో ఉంటే మీకు రక్షణ అని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం బాపూజీ కళా మందిర్ లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు చేసిన దిశ చట్టం పై అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ ఏప్ డౌన్లోడ్ చేసుకోండి మహిళలు దశ మార్చుకోండి అంటూ పిలుపునిచ్చారు. దిశా ఏప్ ఉంటే ఒక ముఖ్యమంత్రి, హెూం శాఖ మంత్రి, డీజీపీ మీతో ఉన్నట్లేనని పేర్కొన్నారు. ఇలాంటి చట్టం తాను స్పీకర్ స్థానంలో ఉంటూ ఆమోదించడం చాలా గర్వంగా ఉందన్నారు. ఆపద సమయంలో బటన్ నొక్కండి వెంటనే మొబైల్ లొకేషన్ 10 సెకన్లు నిలువు గల ఆడియోతో ఉన్న వీడియో నమోదు అవుతుందని, ఇది పోలీసు కంట్రోల్ రూంకు చేరవేయబడుతుందన్నారు. వెంటనే మీ ఫోన్ కాల్ ను కంట్రోల్ రూంకి కనెక్ట్ చేయబడుతుందని పేర్కొన్నారు. మీరు ఉన్న ప్రాంతానికి సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం చేరవేయబడుతుదని చెప్పారు. పోలీసు సిబ్బంది (ఎస్.ఓ.ఎస్.) మొబైల్ ట్రేకర్ అమర్చిన రక్షక వాహనాలు కొద్ది క్షణాల్లోనే బాధితుల వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఒక వేళ బాధిత మహిళ ఫిర్యాదు చేయలేని ఆపద పరిస్థితిలో ఉన్నట్లైతే కేవలం దిశా ఏప్ ఓపెన్ చేసి ఐదు సార్లు మొబైల్ ను కదిపితే ఆటోమేటిక్ గా మీ ఫిర్యాదు కంట్రోల్ రూంలో నమోదు చేయబడుతుందని వివరించారు.

దిశా డి.ఎస్.పి. వాసు దేవరావు మాట్లాడుతూ ఎవరైనా మహిళలపై దాడిచేసిన, అసభ్యంగా ప్రవర్తించినా బాధితురాలు ఫిర్యాదు మేరకు 7 రోజులలో కేసు నమోదు చేసి 14 రోజుల్లో కోర్టులో హాజరు పరచాలన్నారు. తక్కువ సమయంలో విచారణ జరిపి ఎక్కువ శిక్ష పడాలనేదే దిశా చట్టం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. 21 రోజుల్లో శిక్ష పడుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశానంతరం దిశా చట్టం గోడపత్రికను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విటలేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు చిన్మయిదేవి, మాజీ మునిసిపల్ చైర్మన్ మెంటాడా పద్మావతి, తదితరులు

# చెత్త తరలింపు కేంద్రం (ఎం.ఎస్.ఎఫ్.-4) పరిసరాల అపరిశుభ్రతపై ఆగ్రహం



విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. వి. సన్యాసిరావు బుధవారం చెత్త తరలింపు కేంద్రం (ఎం.ఎస్.ఎఫ్. - 4), మూడవ జోన్ 18వ వార్డు పరిధిలోని ఎం.వి.పి. కోలనీ సెక్టార్-2 పరిసర ప్రాంతాలలో పర్యటించారు. చెత్త తరలింపు కేంద్రం-4 పరిసర ప్రాంతం అంతా చెత్త అధికంగా ఉన్నందున వెంటనే చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, ఎం.ఎస్.ఎఫ్.-4 ఇంచార్జ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎం.వి.పి. కోలనీలో రోడ్లను, కాలువలను పరిశీలించి ప్రతీ రోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ పక్కాగా జరగాలని, నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పారిశుధ్య కార్మీకులను సర్దుబాటు చేసి, ఎవరికి నిర్దేశించిన పనిని వారిచే చేయించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. ఎ.ఎల్.ఒ. కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించాలి. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా వంటి కేసులు రాకుండా చూడాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చెత్త తరలింపు కేంద్రం-4 ఇంచార్జ్ అప్పలరాజు, 18వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ గోవింద్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎదురుదెబ్బలు తగిలినా ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదు : అశోక్‌గజపతిరాజు



విజయనగరం: మాన్సాస్ ట్రస్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అతిగా జోక్యం చేసుకుంటోందని ట్రస్టు ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు ఆరోపించారు. మాన్సాస్ ట్రస్టు ఛైర్మన్‌గా అశోక్‌గజపతిరాజును నియమిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సంచయిత గజపతిరాజు, ఊర్మిళ గజపతిరాజులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను హైకోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన అశోక్.. హైకోర్టు తీర్పును మరోసారి స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అనేక ఎదురుదెబ్బలు తగిలినా ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని వ్యాఖ్యానించారు. ఇష్టానుసారం నియామకాలు చేపట్టి ట్రస్టు ప్రతిష్టను దెబ్బతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశించినా ఇప్పటివరకు ఈవో తనను కలవలేదని.. తన ఆదేశాలను పట్టించుకోవడం లేదని తెలిపారు. ట్రస్టు ఛైర్మన్‌గా సంచయిత గజపతిరాజు చేసింది తక్కువ.. హడావుడి ఎక్కువ అని ఎద్దేవా చేశారు. ఆర్భాటం కోసం రూ.కోటి ట్రస్టు నిధులతో కార్లు కొన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విచారణ కమిటీపై తనకేమీ ఆందోళన లేదని అశోక్ గజపతిరాజు స్పష్టం చేశారు.

# ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు పదవీ బాధ్యతలు స్వీకరణ - హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు




పాడేరు : రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ గా శతక బుల్లిబాబు బుధవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ట్రైకార్ ఛైర్మన్ గా లాంఛనంగా పదవి బాధ్యతలు స్వీకరించారు.పదవి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎపి మెడికల్ కౌన్సిల్ సభ్యులు డా. టి.నర్సింగరావు, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, ట్రైకార్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రబాబు, నేను సైతం ఫౌండేషన్ ఫౌండర్ శివ కుమార్ సమక్షంలో పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుకూలంగా, తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ కార్యక్రమాలను మరింతగా ప్రజల ముంగిట తీసుకుని వెళ్లి ప్రభుత్వ పరిపాలనకు నావంతుగా అహర్నిశలు కృషి చేశానన్నారు. ట్రైకార్ ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు, ఆర్థికంగా అభివృద్ధికి దోహదపడే సంక్షేమ కార్యక్రమాలు అమలుకు నిరంతరం కృషి చేస్తుమన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి ముఖ్య నేతలు, నాయకులు కార్యకర్తలు,సర్పంచులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు ఆయా శాఖలు సమన్వయంతో పరిష్కరించాలి



శ్రీకాకుళం : ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం లో సమస్యలు ఉంటే ఆయా శాఖలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. సోంపేట ప్రాంతంలో ఉద్ధానం తాగునీరు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి బుధవారం రైల్వే, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, అటవీ శాఖలతో వివిధ సమస్యలు పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టు వచ్చే ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల కు సంబంధించి సమస్యలు ఉంటే మండలాల వారీగా గుర్తించి వాటిని సమన్వయంతో పరిష్కరించుకొని ప్రాజెక్టు నిర్మాణం నకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రాజెక్టు కు నిర్మాణంనకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి ఎస్ఇ లు వీరభద్రరావు, తిరుమలరావు, కాంతిమతి, అటవీశాఖ, జాతీయ రహదారికి సంబంధించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# అనర్హతకు ఖచ్చితమైన గడువు పెట్టాలి



ఈ లొసుగును ఫిరాయింపుదారులుకు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ ఏళ్ళ తరబడి అనర్హత వేటు పడకుండా తప్పించుకుంటున్నారని చెప్పారు. చట్టంలోని ఈ లొసుగు రాజకీయ అవినీతి, పార్టీ అవిధేయత, పార్టీ టిక్కెట్‌పై గెలిచి పార్టీకి ద్రోహం తలపెట్టే వంటి ప్రజాస్వామ్య వ్యతిరేక కార్యకలాపాలకు ఆస్కారం కల్పించిందని ఆయన పేర్కొన్నారు. అనర్హత పిటిషన్ దాఖలైన మూడు నెలలలోగా ఆ పిటిషన్‌పై సభాపతి నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పినప్పటికీ దీనికి అనుగుణంగా పదవ షెడ్యూలును సవరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని విజయసాయి రెడ్డి అన్నారు. జేడీయూ సభ్యుడు సభ్యుడు శరద్ యాదవ్‌కు వ్యతిరేకంగా దాఖలైన అనర్హత పిటిషన్‌పై మూడు మాసాల్లోగా నిర్ణయం తీసుకుని రాజ్యసభ చైర్మన్ ఒక సత్సంప్రదాయాన్ని నెలకొల్పారు. ప్రభుత్వం దీనిని ఒక ప్రమాణంగా తీసుకుని లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్స్‌లో అమలు చేసేందుకు వీలుగా పదవ షెడ్యూల్‌ను సవరించాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు.

**జాతీయ రైతు కమిషన్ ఏర్పాటు చేయాలి...**

దేశంలోని మొత్తం కార్మికులలో 40 శాతం వ్యవసాయంపైనే అధారపడినప్పటికీ

జాతీయ స్థూల ఉత్పాదన (జీడీపీ)లో వారి వంతు కేవలం 20 శాతం మాత్రమే ఉంది. దీనిని బట్టి వ్యవసాయ రంగ సామర్థ్యం, ఉత్పాదకతలో ఎన్ని లోపాలు ఉన్నాయో స్పష్టం అవుతోందని విజయసాయి రెడ్డి వివరించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తున్నప్పటికీ జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్ మాదిరిగా రైతాంగం ప్రయోజనాల పరిరక్షణ, వ్యవసాయ రంగం అభ్యున్నతి కోసం రాజ్యాంగబద్ధంగా శాశ్వత ప్రాతిపదికన జాతీయ రైతు కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉన్నందున ఈ దిశంగా చర్యలు తీసుకోవలసిందిగా ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. హైకోర్టును కర్నూలుకు తరలించాలి. పాలనను వికేంద్రీకరించి అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ మేరకు పాలన వికేంద్రీకణను వాంఛిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టాన్ని ఆమోదించింది. దీనికి అనుగుణంగా విశాఖపట్నంను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేస్తూ చట్టంలో పొందుపరచింది. కాబట్టి ప్రస్తుతం అమరావతిలో ఉన్న హై కోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తూ రీ నోటిఫై చేయాల్సిందిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు న్యాయ శాఖ మంత్రికి వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. అలాగే కర్నూలులో నేషనల్ జుడిషియల్ అకాడమీ, నేషనల్ లా యూనివర్శిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

# శ్రీవారికి ప్రథమ సేవకుడిగా రెండోసారి అవకాశం..

సుబ్బారెడ్డి చెప్పారు. తిరుమలలో ప్లాస్టిక్ పూర్తిగా బ్యాన్ చేసి పర్యావరణ పరిరక్షణ దిశగా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

వాయు కాలుష్యాన్ని నియంత్రించే విధంగా డీజిల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించ నున్నామని టీటీడీ చైర్మన్ వెల్లడించారు. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే భక్తులు ఎలక్ట్రిక్ వాహనాల్లో ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. వెయ్యేళ్ల కిందట ప్రకృతి సిద్ధ వ్యవసాయం ఆధారంగా పండించిన ధాన్యాలతో శ్రీవారికి నైవేద్యం సమర్పించే వారని, మళ్లీ 100 రోజులుగా తిరిగి ఆ విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు.

**టీటీడీ ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం**

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఛైర్మన్‌గా నేడు వైవీ సుబ్బారెడ్డి రెండోసారి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం 9.45 నిమిషాలకు శ్రీవారి ఆలయంలో టీటీడీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా టీటీడీ ఛైర్మన్‌గా ఆయనకు మరోసారి అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో టీటీడీ బోర్డు సభ్యులను నియమిస్తామని ఇటీవల ప్రకటించింది.

# సీఎం జగన్‌ను కలిసిన భారత మహిళా హాకీ ప్లేయర్ రజనీ

చిత్తూరు జిల్లా ఎర్రావారిపాలెం. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఒలంపిక్స్ హకీలో పాల్గొన్న ఏకైక క్రీడాకారిణిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. 2016లో జరిగిన రియో ఒలంపిక్స్‌తో పాటు టోక్యో ఒలంపిక్స్ 2020లో పాల్గొన్న క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. భారత్ తరపున 110 అంతర్జాతీయ హకీ మ్యాచ్‌లలో పాల్గొన్న రజనీ గోల్ కీపర్‌గా మంచి ప్రతిభ కనపరిచింది. టోక్యో ఒలిపింక్స్‌లో కాంస్య పతక పోరులో మహిళల హాకీ జట్టు ఓటమి పాలైనప్పటికి భారత అభిమానుల మనసులు మాత్రం గెలుచుకున్నారు.

ఈ కార్యక్రమంలో రజనీ కుటుంబ సభ్యులు, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ భార్గవ, శాప్ వీసీ అండ్ ఎండీ ఎన్.ప్రభాకర్ రెడ్డి, శాప్ అధికారులు రామకృష్ణ, జూన్ గ్యాలట్, రాజశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# 7 వ వార్డులో జెడ్సీ రాము పర్యటన



మధురవాడ: మహా విశాఖ జోన్2 పరిధి 7వ వార్డు టైలర్స్ కాలనీ, శ్యామ్ నగర్ కాలానిలలో బుధవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యటించారు. పారశుధ్య పనులను పరిశీలించారు, తమ శిబ్బంది పని తీరుపై అరా తీశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై మలేరియా ఇన్స్పెక్టర్ రాంబాబు, సూపర్వైజర్ బేబి రాణి లతో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ పర్యటన లో వార్డు స్పెషలాఫీసర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, హెల్త్ సెక్రటరీ, స్థానిక వైసిపి నాయకులు బంగారు ప్రకాష్ ,బి .రాజు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి


అచ్యుతాపురం : రైతులు పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగాచారి అన్నారు. బుధవారం మండ లంలో జగ్గన్నపేట గ్రామ పొలాలలో నిర్వహించిన వైఎస్ ఆర్ పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులకు అవసరమైన సలహాలు, సూచ నలు చేశారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. నారు మడిలో తీసుకోవలసిన జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొడ్డి కృష్ణ, మల్ల బుజ్జి, విఎఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రంలో పడిగాపులు



అరకులోయ : అరకు నియోజకవర్గ అరకు లోయమండల కేంద్రంలో గల ఆధార్ కేంద్రంలో పరిసర ప్రాంతంలో గల పంచాయితీ ప్రజలు అదేవిధంగా ఆయా మండలాల ప్రజలు ప్రభుత్వం చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలు వినియోగించు కావాలి అయితే ప్రతి ఒక్క రైతుకు లబ్ధిదారులకు ఆధార్ లింకు కలిగి ఉండటంతో ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ ఫలాలను వినియోగించు కోవచ్చని ప్రజలు ప్రతి దినం మండల కేంద్రానికి నలభై యాభై కిలోమీటర్ల మారుమూల గ్రామాల నుంచి తరలి వచ్చి ఉదయం 6 గంటల నుంచి గర్భిణీలు, వృద్ధులు చిన్న పిల్లలతో పడిగాపులు చేస్తున్నామని బుధవారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబం ధిత ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలను గుర్తించి ఇటు వంటి సమస్యలను తక్షణ చర్యలు తీసుకొని పరిష్క రించాలని కోరుతున్నారు.

## శ్రావణమాసం సందర్బంగా లక్ష కుంకుమార్చనకు భారీ ఏర్పాట్లు



సింహాచలం : సింహగిరి పై సింహవల్లి తాయారు సన్నిధిలో శ్రావణమాసం పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీ (శుక్రవారం) శ్రావణ శుక్రవారం మొదటి శుక్రవారం లక్ష కుంకుమార్చన జరుగును. ప్రతీ శ్రావణ శుక్రవారం లక్ష కుంకుమార్చన జరుగును. 20, 27, సెప్టెంబర్ 03వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సింహవల్లతాయారు సన్నిదిలో లక్షకుంకుమార్చన జరుగును. ఈ పూజల్లో భక్తులు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పాల్గొనే అవకాశముంది. ఇందుకోసం రూ.2,500 చెల్లించి సాయంత్రం 5:30 గంటల నుంచి రూ.500 చెల్లించి సహస్రనామార్చనలో పాల్గొనే వీలుంది. ఆన్ లైన్ ద్వారా పాల్గొనదలచినవారీ ఈ కింది అకౌంట్ కు అమౌంట్ అడ్రస్ స్తోత్ర నామాలు పంపించగలరు. అంతేకాదు ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి 5:30 గంటలవరకు అమ్మవార్ల తిరువీధి ఉత్సవం జరుగును. సింహవల్ల తాయార్, ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలు జరుగును. ఏమైనా సందేహాలుంటే 6303800736 నంబర్ కు వాట్సప్ లేదా ఫోన్ చేసి తెలుసుకోగలరని దేవస్థానం అధికారులు తెలిపారు.

## రెవెన్యూ భూముల్లో అక్రమ లే అవుట్లు

గొలుగొండ : గొలుగొండ మండలంలో పలు రెవిన్యూ భూముల్లో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. ఏటి గైరంపేట, చీడిగుమ్మల, గుండుపాల, ఎర్రవరం, మల్లంపేట, చోద్యం, కేడీపేట పాతూరు గ్రామాల్లో పంట భూములను ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేస్తున్నారు. పంచాయతీ నుంచి అనుమతులు తీసుకోకుండా ప్లాట్లుగా విభజన చేసి విక్రయాలు చేస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని కొత్త మల్లంపేట సర్పంచ్ పొలిరెడ్డి రాజుబాబు తెలిపారు. చీడిగుమ్మల, కొత్త మల్లంపేట, కేడీపేట, చోద్యం పంట భూములను పంచాయతీ నుంచి అనుమతులు పొందకుండానే మూడు నుంచి ఐదు సెంట్ల చొప్పున ప్లాట్లు వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పంట పొలాలను మార్చాలంటే కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయినప్పటికీ వాటిని పట్టించుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు చూడక పోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తమల్లంపేట గ్రామంలో వేసిన అక్రమ లేఅవుట్ల విషయాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా కొత్తమల్లంపేటలో సంబందించిన సమాచారం తమ వద్ద లేదన్నారు. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 550 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు

మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలో ఇప్పటి వరకు 550 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి చేశామని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొత్తం అన్ని రకాల పంటలు కలిసి 6500 ఎకరాలు ఈ క్రాప్ చేయాల్సి ఉందన్నారు.

## పారిశుధ్యం పై అవగాహన కల్పించాలి

### 2వ వార్డు బీజేపీ అధ్యక్షులు శీరపు రామలక్ష్మి




భీమునిపట్నం : జివిఎంసి భీమిలి జోన్ రెండవ. వార్డ్ పరిధిలో ఉన్న తగరపువలస, చిట్టివలస ప్రాంతాలలో ప్రజలు డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడుతున్నారని అందువల్ల జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని 2 వ వార్డు బీజేపీ అధ్యక్షులు శీరపు రామలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు.

వీధుల్లో ప్రజారోగ్య కార్యక్రమాలు చేప ట్టాలని కోరారు. వార్డుల్లో ప్రజలకు తడి పొడి చెత్త పై అవగాహన కల్పించాలని ఎక్కువ ఉన్న చోట్ల చెత్త ను వెంట వెంటనే తరలించాలని కోరారు. ప్రతిరోజు బ్లీచింగ్ చల్లించటం,నీరు నిల్వ ఉన్న చోట్ల మరియు కాలువలలో దోమలు అభివృద్ధి చెందకుండా పారిశుధ్య సిబ్బందితో క్రిమి సంహారక మందులు చల్లించాలని,వారానికి ఒక్క సారి ఐనా వీధుల్లో మురుగు నీరు వల్ల, చెత్త వల్ల వచ్చే దుష్ప్రభావాలను ప్రజలకు అర్ధం అయ్యే రీతిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని రామలక్ష్మి తెలిపారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశా మని అన్నారు.

## మల్లవరం శివార్లలో 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



అచ్యుతాపురం : మండలంలో మల్లవరం శివార్లలో నాటు సారా కాసేందుకు సిద్ధం చేసిన 1500 లీటర్ల బెల్లం ఊటను బుధవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి నాటు సారా స్థావరాలుపై దాడులు నిర్వహించామన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో కలుపు శుభ్రం చేయించిన బాపు ఆనంద్



విశాఖపట్నం : 31వ వార్డ్ గొల్లలపాలెం స్థానికుల అభ్యర్ధన మేరకు ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణను వార్డ్ ఇంచార్జి దొడ్డి బాపు ఆనంద్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సూచనలు మేరకు పర్యవేక్షించారు. కళాశాల ఆవరణలో వెనుక భాగంలో గోడకు దగ్గరగా ఉన్న పొడవాటి చెట్ల ద్వారా ప్రాకిన దట్టమైన వేర్లను, పొదులను వారి అభ్యర్ధన మేరకు జీవీఎంసీ సిబ్బంది సహకారంతో తొలగింపు కార్య క్రమం మొదలు పెట్టారు.

కళాశాల ప్రిన్సి పాల్ బొడ్డేపల్లి రాధ మాట్లాడుతూ, గత రెండు నెలలుగా వర్షాలు పడటం వలన చెట్లు, కలుపు మొక్కలు విపతీతంగా పెరిగి పోయాయని, రానున్న జెండా పండు గను దృష్టిలో ఉంచు కొని తమ అభ్యర్ధన మేరకు కూడా వెను వెంటనే స్పందిం చిన బాపు ఆనంద్కి కృత్ఙ తలు తెలిపారు. కళా శాల గోడకు అనుకొని ఉన్న స్థాని కులు చెత్త చెదారాలను కళాశాల ఆవర ణలోకి వెయ్య రాదని బాపు ఆనంద్ కోరారు.

## 82వ వార్డులో కార్పొరేటర్ పర్యటన



అనకాపల్లి : జివిఎంసి 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత వార్డులో విస్తృతంగా పర్యటించారు. వాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. విజయరామరాజుపేట పరిధిలో మురుగు నీటి కాలువలు, తాగు నీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు. సచివాలయాన్ని సందర్శించి సమయం మించి పోయినా తెరవక పోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

## సమస్యలకు సత్వర పరిష్కారమార్గాలు చూపాలి

విశాఖపట్నం : మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న సేవల విషయంలో క్షేత్రస్థాయిలో లోటుపాట్లను, సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలను చూపాలని ఆ శాఖ సంయుక్త సంచాలకురాలు చిన్మయిదేవి సూచించారు. ఎంవీపీ అప్పుఘర్ దరి సమావేశమందిరంలో విశాఖ జిల్లాలోని ఐసిడిఎస్ల సిడిపివోలు, పర్యవేక్షకులు, ఇతర అనుబంధ సంస్థల సిబ్బందితో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలో వైఎస్సాఆర్ ప్రీ స్కూళ్ల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్నందున దీనికి సిద్ధం కావాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి



అచ్యుతాపురం : విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన అచ్యుతా పురంలో విఆర్ఎల అధ్యక్షుడు గాలి పరదేశి నాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా సోమునాయుడు మాట్లాడుతూ విఆర్ఎల కనీస వేతనం 21 వేలు ఇవ్వాలని, పాదయాత్రలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హమీలను అమలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో....

విఆర్ఎలు కృష్ణ, అప్పారావు, వెంకట లక్ష్మి, రాము, రమేష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## జంగల్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి

### ఏఎంహెచ్ఓను కోరిన 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : వార్డు పర్యటన లో భాగంగా బుధవారం జనతా బజారు షాపింగ్ కాంప్లెక్స్ వెనకాల ఉన్న జంగల్ బాగా పెరిగింది. సమ స్యను జివియంసి ఏఎం హెచ్ఓ కిశోర్కి 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు తెలిపారు. వెంటనే జంగల్ మొత్తం క్లియర్ చేసి అక్కడ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఎం హెచ్ఓ చెప్పారు.

## కూలిన ధ్వజస్తంభం కొత్త ధ్వజస్తంభం ఏర్పాటు





సింహాచలం : శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయం సీతారామాలయంలో ధ్వజ స్తంభం కాలాతీతమై ఉదయం 6:30 ప్రాంతంలో కూలి పోయింది. దశాబ్దాల క్రితం (దాదాపు 60 ఏళ్లు) ఏర్పాటుచేసిన ఈ ధ్వజస్తంభంలోపలి కర్ర పూర్తిగా చెదలుపట్టడమే దీనికి కారణం సీసీకెమెరాలను ఈఓ సహా ఉన్నతాధికారులు పరిశీలించగా అది తనంతట తానే పడిపోయిందని తేలింది సీసీకెమెరాకూడా పడిపోయినట్లు రికార్డయ్యింది ఇందులో ఎవరి ప్రమేయంలేదని కాలాతీతమవ్వడమే కారణమని నిర్ధారణ అయ్యింది వేద మంత్రాలు సంప్రోక్షణ తర్వాత ధ్వజస్తంభం స్థానంలో తాత్కాలిక ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు పది రోజుల్లో శాశ్వతంగా కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుచేస్తామని ఈఓ సూర్యకళ తెలిపారు.

## చిత్ర పరిశ్రమ విశాఖకు తరలి రావాలి

-స్థానికంగా చిత్రీకరణకు రాయితీలు కల్పిస్తాం
-యువతకు సంపూర్ణ ప్రోత్సాహం
- వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



సినిమా చిత్రీకరణను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ : పరిపాలనా రాజధానిగా మారుతున్న విశాఖకు చిత్ర పరిశ్రమ తరలి రావాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ భౌతిక శాస్త్ర విభాగం వద్ద వీరవల్లి అగ్రహారం సినిమా చిత్రీకరణను ఆయన ప్రారంభించారు.

ఏయూ విద్యార్థి రాజ్ కిరణ్ స్వీయ దర్శకత్వంలో యదార్ధ గాధ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బేబీ ఇవాంకా సమర్పణలో వి.ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్పై విక్టోరియా రాణి నిర్మాతగా, బండి లక్ష్మీ నారాయణ(గబ్బర్) సహ నిర్మాతగా త్రిభాషా చిత్రంగా వీరవెల్లి అగ్రహారం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూ రంగస్థల విభాగం విద్యార్థి హీరోగా, దర్శకత్వం వహించడం వర్సిటీకి గర్వకారణమన్నారు. విశాఖ నగరంలో చిత్రీకరణ జరిపే సినిమాలకు ప్రత్యేక రాయితీలను అందిస్తామన్నారు. మంచి సందేశాన్ని అందించే మాధ్యమంగా సినిమా నిలుస్తోందన్నారు. యువతను ప్రోత్సహించడానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ఏయూ రంగస్థల విభా గంలో గౌరవ ఆచార్యులుగా ప్రముఖ నటులను నియమిస్తామన్నారు. సినిమా దర్శకుడు రాజ్ కిరణ్ మాట్లాడుతూ విశాఖ పరిసరాలలో, తెలుగు నటీనటులతో చిత్ర నిర్మాణం జరుపుతామన్నారు. దియా రాజ్ హిరోయిన్గా నటిస్తున్నారన్నారు.

సినిమాకు కంచర్ల ప్రేమ్చంద్ సంగీత దర్శకునిగా, కొల్లాబత్తుల బాబు సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ వినోద్, లిరిక్స్ వీరు, కో డైరెక్టర్లు రాహుల్లు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## సంస్కృతానికి అగ్రాసనం

కాకతీయ రాజుల్లో గణపతిదేవుడి తర్వాత కుతుబ్‌షాహీ కాలంలో కొంత కాలం మాత్రమే ఆంధ్ర ప్రాంతాలు ఏకఛత్రాధిపత్యం కింద ఉన్నాయి. ఆంధ్రభాషను మాట్లాడే ప్రజలందరినీ ఏకఛత్రం కిందకు తెచ్చిన మొదటి వారు కాకతీయులే. ఈ కాలంలోనే ఓరుగల్లుకు ఆంధ్రనగరి అని పేరు వచ్చింది.

కాకతీయులు ఆంధ్రప్రాంతాలను పాలిస్తూ ఆంధ్రాభిమానం కలిగి ఉన్నవారు సంస్కృత భాషను అభిమానించి, సంస్కృత భాషలో శాసనాలను వేయించారు. అప్పటికి ఉత్తరభారతం తురుష్కుల చేత ఆక్రమించబడింది. సంస్కృత సాహిత్యాన్ని ఆదరించేవారు కరువైనారు. అప్పుడు సంస్కృత భాష దక్షిణ దేశానికి వలస వచ్చింది. ఎందరో సంస్కృత కవి పండితులు దక్షిణ దేశ రాజులను ఆశ్రయిం చారు. అట్లా ఆదరించిన ప్రభువుల్లో కాకతీయులు అగ్రభాగాన కలరు. అగస్త్యుడు అనే గొప్ప సంస్కృత పం డితుడు ఓరుగల్లు అనే నగరం బయట పెద్ద ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు. అతని వద్ద ఎంతో మంది సంస్కృత విద్యార్థులు విద్యలను అభ్యసించేవారు.

అగస్త్యుడు స్వయంగా 74 సంస్కృత గ్రంథాలు రచించాడు. అతని కొడుకు నరసింహరుషి 'సిద్దోద్వాహము' అనే సంస్కృత లఘు కావ్యాన్ని ఓరుగల్లు గుట్టపై, శిలలపై లిఖింపచేశాడు. 1968లో ఇది పుస్తకంగా వచ్చింది. అగస్త్యుని మేనల్లుడు విశ్వనాథుడు గొప్ప పండితుడు. విద్యానాథుడు అనే మరో పండితుడు 'ప్రతాపరుద్ర యశోభూషణ' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథంలో ఉదాహరణలుగా ప్రతాపరుద్రుని శౌర్యపరాక్రమాలను వర్ణించే పద్యాలు ఉన్నాయి. మొట్టమొదటి సారిగా లక్షణ గ్రంథాల్లో కృతి భర్త రాజును గూర్చి ఉదాహరణ శ్లోకాలుండటం ఇదే మొదలు. మొదటి రుద్రదేవుడు సంస్కృతంలో 'నీతిశాస్త్ర ముక్తావళి'అనే గ్రంథాన్ని రచించాడు. రెండో ప్రతాపరుద్రుడు కూడా కవి. అతడు రుద్రదేవుడు అనే పేరుతో 'యయాతి చరిత్ర' అనే సంస్కృత నాటకాన్ని రచించాడు. ఇది ప్రసిద్ధ నాటకం. తెలుగులో భాస్కర కవి రచించిన రామాయణంలో కొన్ని భాగాలు రుద్రదేవుడు రచించాడు. ప్రతాపరుద్రుడే రుద్రదేవుడనే పేరుతో రచించాడని అంటారు. ఓరుగల్లుకు చెందిన గంగాదేవి బుక్కరాయల కుమారుడు కంపరాయలను వివాహం చేసుకొని అతడు మధురానగరాన్ని జయించిన ఇతివృత్తాన్ని తీసుకొని 'మధురా విజయం' అనే కావ్యాన్ని రచించింది. ఆమె అగస్త్యుని మేనల్లుడు విశ్వనాథుడు తనకు విద్యాగురువని పేర్కొన్నది. సంస్కృతంలో మహాకావ్యాన్ని రచించిన మొట్టమొదటి కవయిత్రి గంగాదేవి. ఈ కావ్యం క్రీ.శ. 1371-74 మధ్య (మధురా) విజయం రాయబడింది. ఆ తర్వాత రఘునాథ రాయల ఆస్థానంలో కవయిత్రులు సంస్కృత కావ్యాలు రాశారు.

మొత్తం సంస్కృత సాహిత్యంలోనే కావ్యరచన చేసిన మొట్టమొదటి కవయిత్రి ఓరుగల్లు వాసియైన గంగాదేవియే. గణపతిదేవుడి దగ్గర గురువుగా ఉన్న శివదేవయ్య 'పురుషార్థసారము', 'నీతిసారము', 'శివదేవధీమణి' అనే సంస్కృత గ్రంథాలను రచించాడు. తిక్కన సోమయాజి గణపతిదేవుడి ఆస్థానానికి వచ్చినప్పుడు శివదేవయ్యను చూసి.. 'ఈతడీశ్వరుడు గాని మనుజమాత్రుడు గాదు' అని ప్రస్తుతించాడు.

ఈ విధంగా ఎంతో సంస్కృత సాహిత్యం కాకతీయుల కాలంలో సృష్టించబడింది. స్వయంగా రాజులే సంస్కృత గ్రంథాలు రచించారు. ఈ విధంగా మీద కవయిత్రి రచించిన మహాకావ్యం రావడము, అనేకమంది సంస్కృత పండితులు కావ్యాలు, శాస్త్రగ్రంథాలు రచించటం తెలంగాణ గడ్డకే గర్వకారణం.

మొట్టమొదటి సారిగా లక్షణ గ్రంథాల్లో కృతి భర్త రాజును గూర్చి ఉదాహరణ శ్లోకాలుండటం ఇదే మొదలు. మొదటి రుద్రదేవుడు సంస్కృతంలో 'నీతిశాస్త్ర ముక్తావళి'అనే గ్రంథాన్ని రచించాడు.



విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమించబడిన కరణం కృష్ణ బుధవారం ఆంద్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ని ఏయూ పరిపాలన విభాగంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం గురు స్థానంలో ఉన్న ఆచార్య ప్రసాద్ రెడ్డి కరణం కృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీస్సులు అందజేశారు.



విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గా నియమింపబడిన కరణం కృష్ణ బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ మల్ల విజయప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కరణం కృష్ణ తో పాటు విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కోర్ కమిటీ ప్రెసిడెంట్ జిఎం రెడ్డి తదితరులు.

# రాష్ట్ర నెడ్ క్యాప్ కార్యాలయము సందర్శించిన కే కే రాజు

## - నాగులపల్లి శ్రీకాంత్ ని మర్యాద పూర్వక కలయిక



అమరావతి : రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్ గా నియమితులైన మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు బుదవారం విజయవాడలో ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఏపీ ట్రాన్స్ కో మరియు స్పెషల్ సెక్రటరీ ఎనర్జీ నాగులపల్లి శ్రీకాంత్ ని మర్యాద పూర్వకంగా కలిసి నెడ్ క్యాప్ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం తాడేపల్లిలో గల నెడ్ క్యాప్ ప్రధాన కార్యాలయంను సందర్శించి అక్కడ సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎండీ & వైస్ ఛైర్మన్ యస్.రమణారెడ్డి మరియు జి. ఏం లు పాల్గొన్నారు.



## కవి సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం ఆవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : చవితి మ.3.52; ఉత్తర ఉ.10.19; వ.ఉ.6.24ల 7.56.

గురువారం 12-08-2021

**మేషం** : విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. **మిధునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిర చరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పు దారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదురవుతుంది. **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకు తనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. **మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి.



# పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కథలు

భారత దేశంలో స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కథలు చూద్దాము. ఈ కథలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు,మగవారు గా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కథలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్ధం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.

మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కథలు చెప్తారు. మొదటిది సాగర మధనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకునేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవించాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషి ని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకురాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహిని గా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దఃఖిస్తాడు.

శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తె గా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కథల ప్రకారం శిఖండి కి అమ్మాయినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని

## సంకీర్తన

తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్ముడిని చంపటానికీ ఒక యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కథలు ప్రచారం లో ఉన్నాయి. చాలా కథల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుంది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు.

సుద్యుమ్న/ఇల పరమశివుడి తోట లోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుండేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇల గా వ్యవహరిస్తారు.

# విజయసాయిరెడ్డిని కలిసిన మండల నూతన సర్పంచ్‌లు



పరవాడ : పరవాడ మండ లంలో వైయస్సార్ కాంగ్రేస్ పార్టీ తరుపున ఇటీవలే నూత నంగా ఎన్నిక కాబడిన సర్పంచ్ లు పెందుర్తి శాసన సభ్యులు అధీప్ రాజ్ నాయకత్వంలో మరియు పరవాడ మండల వైకాపా అధినాయకత్వం సార ధ్యంలో దేశ రాజదాని ఢిల్లీలో వైయస్సార్ కాంగ్రేస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్, పార్లమెంటు సభ్యులు విజయ సాయిరెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిసారు.

ఈ సందర్భంగా పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీలో మెంబర్ గా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన విజయ సాయిరెడ్డికి ఎమ్మెల్యే అధీప్‌రాజ్, నియోజక వర్గ ఇంచార్జ్ అజయ్ రాజ్, రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసి అభ్యర్థి పియస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, నూతన సర్పంచ్ లు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ భేటీలో పరవాడ మండలంలో గల పలు ముఖ్య సమస్యలును విజయసాయిరెడ్డికి వివరిం చారు. వీటిలో ప్రధానంగా నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉన్న కంపెనీలలో ఉధ్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే మండ లంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు.



వీటిపై సానుకూలంగా స్పందించి త్వరలోనే సంబందిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని విజయ సాయిరెడ్డి భరోసా ఇచ్చినట్లు మండల అధినాయకత్వం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో ఆర్ఇసియస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పరవాడ్ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీ సీతారామయ్య,ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింత కాయల సుజాత ముత్యాలు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి కబడ్డీ అప్పారావు,పి బోనంగి సర్పంచ్ కల్పనా రాజశేఖర్ ,కలపాక సర్పంచ్ బొండా కనకా రావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి అమ్మలు గోపి,కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి శ్రీను, పిఎసియస్ చైర్మన్ బురదరాజు, ఎంపీటీసి అభ్యర్థి బూస అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిల్లర రాజకీయాలు చేయడం లేదు బిడిజాల అప్పారావు

**- బీజేపీ మండల అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు**



మురుకుర్తి అప్పలరాజు

కొయ్యూరు : చిల్లర రాజకీయాలు మేము చేయటం లేదు, మాకు అవసరం కూడా లేదన్న విషయాన్ని డౌనూరు ఎంపిటిసి అభ్యర్థి బిడి జాల అప్పలరాజు తెలుసుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు మురు కుర్తి అప్పలరాజు చెప్పారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సభ విజయవంతం అయితే బిజెపికి పేరు, ప్రఖ్యాతలు వస్తాయోనని కావాలని మీ పార్టీ నాయకులు, మీ కార్యకర్తలు ఆడిన డ్రామా..అవునా? కాదా? మీ అది నాయకులకు అడిగి తెలుసుకొని నిజ నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు. నిర్మలా సీతారామన్ బిజెపి మంత్రి ఆమెతో మేము స్వయంగా మాట్లాడి తెలుసుకున్న విషయాలను ప్రజల ముందు ఉంచామన్నారు. లోకుల గాందీతో కేంద్ర మంత్రి మీ ఊరు రాలేక పోయానని చెప్పినప్పుడు పక్కన మేమున్నామన్నారు. అసలు పర్యటనే లేదని అంత ఖచ్చితంగా ఎలా చెప్పుతున్నారో అర్థం కావడం లేదన్నారు. కేంద్ర మంత్రి పర్యటనలో ఒక్క ఎంపి మాధవి తప్ప వైసీపీ మండల కార్యకర్త పార్క్ ఆవరణలో కనిపించిన దాఖలా లేదన్నారు. అన్నీ నాకు తెలుసుఅన్నట్లు మాట్లాడ కుండా కొన్ని రుజువులు నిర్ధారించుకొని మాట్లాడటం మంచిదన్నారు.

# ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ మాధవి

కొయ్యూరు : భారత దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహచర మహిళా పార్లమెంట్ సభ్యులతో కలిసిన అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి



ప్రధానితో ఎంపీలు

# కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు చేయండి

**-నైపుణ్య, సామాజిక ప్రాధాన్యతతో ప్రాజెక్టులు నిర్వహణ - క్రెడిట్ కోర్సుగా ఐపిఆర్**

**-వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి**



ఆంధ్రాయూనివర్సిటీ : వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా సిల బస్‌లో మార్పులు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సూచించారు. బుధవారం ఉదయం నిర్వహించిన వార్షిక బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ కంటెంట్ అభివృద్ధి చేయడం, డిజిటల్ రిసోర్సెస్ కలిగి ఉండా లన్నారు. పీజీ స్థాయిలో మూక్స్ కోర్సులను ప్రారంభించాలని, మేధోహక్కులను క్రెడిట్ కోర్సుగా అందిస్తామన్నారు. ట్రాన్స్ డిసిప్లేనరీ సెంటర్ ఏర్పాటు, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌కు ప్రోత్సాహం, లాజిస్టిక్స్‌లో నైపుణ్య శిక్షణ కోర్సులు అందించడం జరుగు తుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అదనం 10 శాతం సీట్లను పొరుగు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తామన్నారు.

వర్సిటీ పరంగా సీడ్ ఫండ్‌ను ఏర్పాటు చేసి యువ అధ్యాపకులు పరిశోధనలు జరపడానికి తోడ్పాటును వర్సిటీ పరంగా అందిస్తామని ప్రకటించారు. 20 శాతం వరకు సిలబస్‌ను మార్పుచేయాలని, నైపుణ్యత పెంపొందించే కోర్సులను యూజీ, పీజీలో భాగం చేయాలన్నారు. ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దడం ప్రధానమన్నారు. నాణ్యమైన విద్యను అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. జాతీయ నూతన విద్యా విధానం(ఎన్ఇపి) 2020ని రాష్ట్ర ప్రభుత్వం అమోదించి, అమలు జరుపుతోందన్నారు. ఏయూను దేశంలోని అత్యుత్తమ 10 విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి నిర్ధేశించారని, దీనికి అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఇపిలో సూచించిన విధంగా ఏయూ ఇప్పటికే మల్టీ డిసిప్లేనరీ వర్సిటీగా ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

# పరవాడ మండల టీడీపీ ప్రెసిడెంట్ గా వియ్యపుచిన్నా





పరవాడ : పరవాడ మండల టిడిపి ప్రెసిడెంట్ గా వియ్యపు చిన్నాను పార్టీ అధిష్టానం నియమించారు. ఈయన గతంలో జిల్లా తెలుగుయువత అర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేసారు. ఈ సందర్భంగా విజయభాను ప్రతినిధితో వియ్యపుచిన్నా మాట్లడుతూ నాపై నమ్మకంతో టిడిపి మండలపార్టి ప్రెసిడెంట్ గా నియమిం చునందుకుగానూ మాజీ మంత్రివర్యులు బండారు సత్య నారాయణమూర్తికు, మాజీ శాసనసభ్యులు గండిబాబ్జికు, టీడీపీ పెందుర్తి ఇంఛార్జి బండారు అప్పల నాయుడు కుమాజీ జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధ రావుకు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పల నాయుడుకు, మాజీ మండల పార్టీ ప్రెసిడెంట్ బొండా సన్ని దేముడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరిచారు. పార్టీ అధిష్టానం అదేశాలు మేరకు మండలములో తెలుగుదేశం పార్టీ బలో పేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా వియ్యపు చిన్నా తెలిపారు.

# సర్పంచులకు ముగిసిన శిక్షణ తరగతులు

**- సర్టిఫికెట్లు పంపిణీ చేసిన**

**డియల్‌పిఓఆర్ శిరీష రాణి, డియల్‌డిఓ సత్యనారాయణ**






విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గత నెల 22 నుండి ఈనెల 11వ తారీకు వరకు నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారిణి ఆర్ శిరీషారాణి ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో జరుగుతున్న మూడు రోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా చివరి రోజైన బుధవారం ముగింపు కార్యక్రమం జరిగింది. మొత్తం 15 మండలాలకు చెందిన 340 మంది సర్పంచ్ లకు 323 మంది సర్పంచ్ లు ఆరు బ్యాచ్ లుగా ఈ 21 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి మరియు సచివాలయ వ్యవస్థ గురించి సమగ్రమైన శిక్షణ పొందడం జరిగింది. ప్రతి రోజుఉదయం 9 గంటలకు హార్ట్ ఫుల్ నెస్ సంస్థ మెడిటేషన్ క్లాసులను నిర్వహించి సర్పంచులు వారి రోజువారీ కార్యక్రమం లో భాగంగా వచ్చే ఒత్తిడిలను ఏ విధంగా అధిగమించాలి అనే దానిపై ప్రత్యేకమైన తరగతులు తీసుకోవడం జరిగింది. విస్తరణ కేంద్రం సామర్లకోట నందు శిక్షణ పొందినటువంటి మాస్టర్ ట్రైనర్స్ చే సర్పంచుల విధులు, పంచాయతీ రాజ్ సంబంధించిన ఆర్థిక వనరులు, గ్రామపంచాయతీ రికార్డు నిర్వహణ గ్రామ స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, జగనన్న స్వచ్ఛ సంకల్పం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.

ఈ శిక్షణ తరగతులు అన్ని కూడా వసథిగృహ సౌకర్యంతో ఈ కార్యక్రమం జరిగింది. చివరి రోజైన ఈ రోజు మహిళా సర్పంచ్ లచే ఇష్టాగోష్టి నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఈరోజు మూడు రోజుల పాటు శిక్షణ పొందిన సర్పంచులకు సర్టిఫికెట్లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారిణి ఆర్ శిరీష రాణి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి సత్యనారాయణ ఈ నూతనంగా ఎన్నికైన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నాడు-నేడు పనులు పూర్తి చేయాలి



శ్రీకాకుళం : నాడు - నేడు లో భాగంగా జిల్లాలో జరుగుచున్న ప్రభుత్వ పాఠశాలలో పనులు ఆగస్టు 15 నాటికి పూర్తి కావలసిందేనని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సమావేశ మంది రంలో నాడు - నేడు పనులపై జిల్లా అధికారులు, మండల విద్యాశాఖా ధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. జిల్లాలో 1220 పాఠశాలల్లో నాడు %--%నేడు పనలు ఉండగా 1138 పాఠశాలల్లో పనులు పూర్తయిందని, మిగిలిన పనులు ఆగస్టు 15 నాటికి పూర్తి కావలసిందేనని అన్నారు. రాష్ట్రంలో నాడు నేడు పనులలో ప్రధమ స్థానంలో నిలవాలని అన్నారు. చిన్న పనులు పెండింగ్ వలన రాష్ట్రంలో 10వ స్థానంలో ఉన్నామని, యం బుక్, బిల్స్ ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయడం వలన రాష్ట్రంలో ప్రధమ స్థానంలో వెళతామని త్వరలో చిన్న పనులు పూర్తి చేసి ఆన్ లై న్ లో అప్ లోడ్ చేయవలసిందిగా ఆదేశించారు. జిల్లాలో నాడు- నేడు పనులలో మిళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, పాలకొండ, సీతంపేట వెనకబడి ఉన్నాయని, మండల విదాశాఖాధికారి ఇతర సిబ్బందితో కలసి సమన్వయంతో పనిచేసి త్వరలో పని పూర్తి చేయాలని అన్నారు. పెయింటర్స్ సంఖ్యను పెంచి పని గంటలు పెంచుకోవడం ద్వారా ఒక ప్రణాళిక బద్ధంగా పని చేస్తే ఆగస్టు 15 నాటికి 100 శాతం పెయింటింగు పనులు పూర్తవుతాయని కలెక్టర్ తెలిపారు. స్కూల్ తెరిచేనాటికి నాడు-నేడు పనులతో ఎంతో ఆహ్లాదంగా చక్కగా తిర్చిదిద్దాలని, ఈ పనులను చూసి పిల్లలు వాలు తల్లి దండ్రులు సంతోషించాలని తెలిపారు. ఈ సమా వేశంలో డా. కె.శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సభ్యత్వ పెంపుపై దృష్టి పెట్టాలి : డా.రావు



కాకినాడ : నూతన సభ్యులను రోటరీ సంస్థలోకి ఆహ్వానించడంద్వారా సేవా కార్యక్రమాల విస్త ృతికి ఎంతగానో ఉపయోగపడుతుందని పాస్ట్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. ఎస్.వి.ఎస్.రావు అన్నారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ బోర్డ్ సమావేశం స్థానిక కాస్మాపాలిటిన్ సమావేశ మందిరంలో క్లబ్ అధ్యక్షులు డి. అజయ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. డా. రావు మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ అధ్యక్షులు శేఖర్‌మెహత భారత దేశంనుండి ప్రాతినిథ్యం వహిస్తు న్నారని సభ్యత్వం పెంపుదలపై ప్రత్యేక దృష్టిపెట్టడంద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ రోటరీకి ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. తాను రోటరీ జాతీయ అంతర్జాతీయ కమిటీలలో సభ్యునిగా కొనసాగుతున్నానని అందువల్ల రోటరీ గోల్డెన్‌జూబ్లీపై ప్రత్యేక దృష్టి అందరికి ఉంటుందన్నారు. సభ్యత్వాన్ని పెంచడంలో సభ్యులందరూ ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని దీనిద్వారా అనుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయగలమన్నారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్‌చేపడుతున్న వివిద సేవాకార్యక్రమాలు పలు క్లబ్‌లకు మార్గదర్శకంగా ఉందని చెప్పారు. క్లబ్ అధ్యక్షులు బి. అజయ్‌రెడ్డి మాట్లాడుతూ జులై మాసంలో క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమ విషయాలను విశదీకరించారు. క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 4లక్షల 50వేలతో నిర్మిస్తున్న రోటరీ గోల్డెన్‌జూబ్లీ శౌచాలయ నిర్మాణానికి విరాళాలు అందించిన దాతలు క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాల నిర్వహణపై దృష్టిపెడుతున్నామన్నారు. ఆగష్టుమాసంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంతోపాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టే కార్యక్రమాన్ని బోర్డు సభ్యులకు వివరించారు. పి.డి.జి. ప్రాతినిథ్యం వహిస్తున్న తమ క్లబ్ మరింత సేవా ప్రగతిలో నిలబడాలన్న తన ఆకాంక్షను నెరవేరడానికి సభ్యులు సహాయ సహకారాలతోపాటు సూచనలను అందజేయాల్సిందిగా కోరారు. 35 నూతన సభ్యులను చేర్పించాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 15మంది పేర్లను నమోదు చేసామని కొత్తసభ్యుల వివరాలను బోర్డు సమావేశంలో వివరించడం జరుగుతుందని బోర్డు అనుమతితో వారందరికి క్లబ్ సభ్యత్వాన్ని అందజేయబడుతుందన్నారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డా. ట్రస్ట్ రామకృష్ణ మాట్లాడుతూ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవాకార్యక్రమాలపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదుపై అందరూ దృష్టిపెట్టాలని దానిద్వారా క్లబ్‌కు మరియు మన డిస్ట్రిక్ట్‌కు ప్రత్యేక గౌరవం గుర్తింపు లభిస్తుందన్నారు. క్లబ్ సేవాప్రగతికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లంకసాయిబాబు, కోశాధికారి సత్తి రవిరెడ్డి, వెత్సాఆనంద్, టేకుమూడి సూర్యనారాయణ, కోటగిరి నాని, డా. గోపినాథ్, ఆవాలమూర్తి, పైడాదీపు, నెక్కంటి శ్రీనివాస్, బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ ధనసాగర్ ప్రసాద్, కార్యదర్శి చార్మినార్‌వర్మ, వి. శ్రీనివాస్, పరశురామ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల చేతకానితనంతోనే

## కేంద్ర మంత్రి పర్యటన విఫలం

### - డౌనూరు ఎంపిటిసి అభ్యర్థి బిడిజన అప్పారావు



కొయ్యూరు : కొయ్యూరు మండల బిజెపి నాయకుల చేతకానితనంతోనే కేంద్ర ఆర్థిక మంత్రి పర్యటన విఫలమైందని డౌనూరు ఎంపిటిసి అభ్యర్థి బిడిజన అప్పారావు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బిజెపి కొయ్యూరు మండల నాయకులకు చేతకాక కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రోగ్రాం సఫలీకృతం కాలేదని, అందులో వైసీపీ నాయకుల ప్రమేయం ఏముందని, ప్రోటోకాల్ ప్రకారం మాత్రమే రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆమెతో పాటు ఉన్నారు కానీ అందులో ఎటువంటి దురుద్దేశ్యం లేదన్నారు. అసలు లోకుల గాంధీకి అవగాహన ఉందో లేదో తెలీదు గానీ ఎవరైనా కేంద్ర మంత్రి రాష్ట్రంలో పర్యటనలో ఉండగా ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్ర మంత్రి వారి వెంట ఎవరైనా పాల్గనవచ్చునన్నారు.

ఆ ఈ మాత్రం కూడా తెలియదా అని ప్రశ్నించారు. ఈ పర్యటన సందర్భంగా కార్యకర్తలకు లేనిపోని హామీలు బిజెపి మండల నాయకులు ఇవ్వడంతోనే నిర్మల సీతారామన్ పర్యటనలో కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అంతే కానీ దానికి వైసీపీ నాయకుల వల్ల పర్యటన విఫలమైందంటే మాత్రం సహించేది లేదన్నారు. ఫెయిల్ చేసింది లోకల్ గాంధీ, వారి టీం సభ్యులే అది ముందు మీరు గ్రహించి పత్రికా ప్రకటన ఇవ్వాలన్నారు. మీ చేతకాని తనాన్ని వైసిపి పార్టీపై తోసిపుచ్చితే సహించేది లేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి వర్యుల పర్యటన షెడ్యూల్లో అసలు బిజెపి నేత లోకుల గాంధీ గ్రామం శరభన్న పాలెంలో పర్యటనే లేదన్నారు.

ఎక్కడలేని విధంగా కొయ్యూరు మండలంలోనే బిజెపి నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తూ ఉంటారన్నారు. దయచేసి చిల్లర రాజకీయాలు చేయవద్దు అని ధ్వజమెత్తారు.

# సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్‌పిడిఓ హేమసుందర్



పరవాడ : పరవాడ మండలము రావాడ పంచాయితీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణాలును వెలెన్నెస్ నిర్మాణాలును బుధవారము స్ధానిక ఎంపిడిఒ హేమసుందర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లడుతూ నూత నంగా నిర్మిస్తున్న భవన నిర్మాణా లుకు నాణ్యత ప్రమా ణాలు పాటించాలి అని అన్నారు. ఈ భవన నిర్మాణాలును త్వరిత గతంగా పూర్తిచేయాలిఅని కంట్రాక్టర్ కు అదేశం చారు. అనంతరము స్దానిక సచి వాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డు లును పరిశీలించారు. సర్కార్ అందజేస్తున్న సంక్షేమ పథకాలును ప్రజలుకు అందజేయ డములో సచివాలయ సిబ్బంది కీలకపాత్ర వహించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో రావాడ పంచాయితీ కార్యదర్శి అనకాపల్లి లక్ష్మణరావు మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణం పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

### - 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనువాస్



పరవాడ : జివిఎమ్ సి 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో నోబల్ ఇన్స్ ట్యూట్ అఫ్ సైన్స్ మరియు టెక్నాలిజీ (నిస్టు) వారి సౌజన్యంతో లంకెలపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో 150 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి.....

ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ రౌతుశ్రీనివాసు విచ్చేసి అయన చేతులు మీదగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా రౌతుశ్రీనువాస్ మాట్లాడుతూ..

పర్యావరణం పట్ల మీకు ఉన్న బాధ్యత, ఆకాంక్ష ఇతరులకు స్ఫూర్తిని ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ ఎమ్ మరియు సుందరపు శ్రీనువాస్, ఉపాధ్యాయులు మరియు నాయకులు తథితర్లు పాల్గొన్నారు.

# ఆనకట్టకు మరమ్మత్తులు చేపట్టాలి



అచ్యుతాపురం : గోదావరి ఆనకట్టకు మరమ్మత్తులు చేపట్టి, పోలాలుకు నీరు పోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామ సదాశివరావు డిమాండ్ చేశారు.

బుధవారం వారు మరమ్మత్తులకు గురైన ఆనకట్టను పరిశీ లిస్తూ ఆనకట్ట మరమ్మత్తులకు గురికావడంతో సముద్రంలోకి వృధాగా నీరు పోవడంతో అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో 6 వేలు ఎకరాలకు నీరు అందక వరి నారు మడులు ఎండిపోతు న్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటిపారుదల శాఖ వారు మర మ్మత్తులు చేపట్టి పోలాలుకు నీరు పోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నేషనల్ గట్కా పోటీలలో ఏపీకి రజతం.. తొలి ప్రయత్నం లోనే..



తిరుపతి (చిత్తూరు): 9వ జాతీయస్థాయి గట్కా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలలో తిరుపతికి చెందిన ర్యాలీ నవశక్తి సత్తా చాటింది. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఈ పోటీలు పంజాబ్ రాష్ట్రంలోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో ఇండియన్ గట్కా అసోసియేషన్ నిర్వహించింది. ఉత్తమ ప్రతిభ కనరబరచి నవశక్తి సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆంధ్రప్రదేశ్ గట్కా అసోసియేషన్ అధ్యక్షురాలు జ్యోత్స్నాదేవి తెలిపారు. అండర్-19 విభాగంలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన నవశక్తి వరుసగా హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక క్రీడాకారిణులపై గెలిచి, ఫైనల్స్‌లో పంజాబ్‌తో తలపడి రెండో స్థానంలో నిలిచిందని ఆమె చెప్పారు.ముగింపు రోజున కేంద్ర క్రీడల శాఖా మంత్రి అనురాగ్ ఠాగూర్ చేతుల మీదు గా రజత పతకాన్ని అందుకుంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎందరో క్రీడాకారిణులు పాల్గొన్నప్పటికీ నవశక్తి మాత్రమే పతకం సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని జ్యోత్స్నాదేవి, రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ మిట్టపల్లి సురేంద్రరెడ్డి, జిల్లా గట్కా అసోసియేషన్ సెక్రటరీ శివ ఆమెను అభినందించారు.

డిసెంబర్‌లో హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా నేషనల్స్‌కు నవశక్తి ఎంపికైందని తెలిపారు.

**ప్రయాణం చేస్తూనే.. ఆన్‌లైన్ ఎగ్జామ్‌కు హాజరు!**

నవశక్తి చిన్నతనం నుంచే క్రీడల్లో విశేషంగా రాణి స్తోంది. పలు రికార్డులు సొంతం చేసుకుంది. రాష్ట్ర, జాతీయస్థాయి పురస్కారాలు సైతం ఎన్నో అందుకుంది. తొలుత స్విమ్మింగ్, స్కేటింగ్, తర్వాత కరాటే, రెజ్లింగ్, ఇప్పుడు గట్కాలో తన సత్తా చాటుతూ క్రీడల్లో తన ప్రత్యేకతను చాటు కుంటోంది. ప్రస్తుతం చెన్నైలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నవశక్తి జాతీయస్థాయి గట్కా పోటీల్లో పాల్గొనేందుకు తిరుపతి నుంచి ట్రైన్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుతో వెళ్తూనే తనతోపాటు లాప్‌టాప్ తీసుకెళ్లింది. ప్రయాణిస్తూనే ఆన్‌లైన్ క్లాసులకు హాజరవడమే కాకుండా ఫైనల్ సెమిస్టర్ పరీక్ష సైతం రాయడం గమనార్హం!

# ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబుకు శుభాకాంక్షలు



ప్రమాణ స్వీకారానికి హాజరైన వైసీపీ నాయకులు

కొయ్యూరు : బుధవారం విజయవాడలో ఆంధ్ర రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కొయ్యూరు వైసిపి మండల యువనేత గొడ్డేటి మహేష్, డౌనూరు సెగ్మెంట్ వైసిపి ఎంపిటిసి అభ్యర్థి బిడిజాన అప్పారావు, గదబపాలెం మాజీసర్పంచ్ నీలపు సూరిబాబు, కొత్తూరు ఉల్లి రామ్మూర్తి, గోపవరం పెట్ల గాంధీ, వైఎన్‌పాకల లక్ష్మణరావు, సురేష్ పట్నాయక్, ధర్మవరం రాజేష్, మల్లవరం వైసిపి నాయకులు శివ, తుబిరిచందర్రావు, తుబిరి రాంబాబు పాల్గొన్నారు.

# మాతృత్వపు మధురిమ ఆస్వాదించండి



గర్భధారణ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడం చాలా సర్వసాధరణం. ఈ మార్పులు ప్రతి మహిళ శరీరంలోనూ ఏర్పడుతాయి. గర్భధారణ సమయంలో మహిళలకు సాధారణ జీవితాన్ని గడపాలని సూచిస్తుంటారు. అయితే గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపాలు కొన్ని ఉన్నాయి. కాబట్టి గర్భధారణ సమయంలో ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండటం ఉత్తమైన మార్గం. దాని తర్వాత అన్నీ. ఎందుకంటే గర్భధారణ అనేది 9నెలలు మాత్రమే కాబట్టి ఆ 9నెలలు మహిళలకు చాలా విలువె%న సమయంగా భావించాలి. గర్భధారణ సమయంలో ఎటువంటి కార్యకలాపాలు ప్రమాదకరమె%నవో మీకు తెలిసుండకపోవచ్చు. కానీ మనకు తెలసిన కొన్ని కార్యకలాపాలు మాత్రం న్యూట్రీషియన్ ఫుడ్ అధికంగా తీసుకోవాలి. దూర్రపయాణాలు చేయకూ డదు. దగ్గర ప్రయాణలైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలి మరియు అధిక బరువులు మోయకూడదు మొదలగునవి. కాబట్టీ మీ గర్భధారణ సమయంలో సురక్షితంగా ఉండటానికి చాలా చాలా లౌకిక విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఉంది. ఉదా: మీకు రాక్ బ్యాండ్ యొక్క సంగీతానికి హాజరు కావడం అనేది గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపంగా చెప్పవచ్చు. గర్భధారణ సమయంలో అధికంగా వ్యాయామం చేయడంతో హార్ట్ బీట్ పెరుగుతుంది మరియు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెంచుతుంది. గర్భధారణ సమయంలో ఉదర భాగంలో వ్యాక్సింగ్ చేయించుకోవడం కూడా మంచిది కాదు. ఇటువంటి కొన్ని చిన్న విషయాలు మీ గర్భధారణ సమయంలో సురక్షితమా కాదా అని గుర్తించేందుకు మరికొన్ని మీకోసం బోల్డ్ స్కై అందిస్తుంది. ఈ రిస్కీ యాక్టివిటీస్ కు గర్భాధారణ సమయంలో దూరంగా ఉండీ ఆరోగ్యాన్ని సురక్షితం చేసుకోండి... ఫర్నీచర్‌ను మార్చకూడదు సాధారణంగా ఇంట్లో వస్తువులు ఫర్నీచర్‌ను ఇక్కడి అక్కడ.. అక్కడవి ఇక్కడ మార్చుతుంటారు. అయితే మీ గర్భధారణ మొదటి సెమిస్టర్ (మొదటి మూడు నెలల్లో) ఇటువంటి రిస్కీ యాక్టివిటీస్ ను నివారించడం చాలా క్షేమం. ఇది మీ మీద ఒత్తిడిని పెంచుతుంది.

**పిల్లలను మోయడం** మీ రెండవ ప్రెగ్నెన్సీ కంటే ముందు మీకు పిల్లలను చూసుకోవల్సిన బాధ్యత ఉంటుంది కాబట్టి, వారు 5కేజీల బరువు కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అతనిని/ఆమెను ఎత్తుకోవడం నివారించడం. లేదంటే మీ వెన్నుకు ఒత్తిడి కలిగించవచ్చు. స్కేటింగ్ వ్యాయామంలో చాలా మంది రోలర్ స్కేటింగ్‌ను ఉపయోగిస్తారు. అయితే మహిళలు గర్భధరించినప్పుడు, ఈ రోలర్ స్కేటింగ్ వ్యాయామాన్ని మానుకోండి. రోలర్ స్కేటింగ్ చేయడానికి మంచి బ్యాలెన్సింగ్ ఉండాలి.స్టీమ్ బాత్‌గర్భధారణ సమయంలో స్టీమ్ బాత్ చేయడం అనేది చెడు ఆలోచన. ఎప్పుడైతే మీ శరీరం వేడి పొందుతుందో, అప్పుడు మీ చర్మని బ్లెడ్ సెల్స్ రీడైరెక్ట్ గావింపబడి మీ చర్మాన్ని చల్లబరుస్తుంది.

## ప్రభుత్వ రంగంలోనే

# శ్రామిక మహిళలకు రక్షణ



విశాఖపట్నం : ప్రభుత్వరంగ సంస్థల్లోనే శ్రామిక మహిళలకు రక్షణ కల్పించబడుతుందని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షురాలు పి.పూర్ణిమ అన్నారు. అటువంటి ప్రభుత్వరంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసి, డిఫెన్స్, ఆయిల్ సెక్టార్ వంటి వాటిని ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆమె తెలిపారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 131వ రోజుకు చేరాయి. మంగళవారం నాటికి దీక్షల్లో ఎల్ఐసి, మున్సిపల్ రంగాలలో పనిచేసే శ్రామిక మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేసి ఉద్యోగాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. ప్రైవేట్ సెక్టార్‌లో మహిళలకు తక్కువ వేతనాలు ఇవ్వడంతో పాటు పనిఒత్తిడి, లైంగిక వేధింపులకు అధికంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. వారంతపు, ప్రసూతి సెలవులు, కార్మిక శాఖ ఇచ్చే సెలవులు సైతం అమలు చేయడం లేదన్నారు. అదే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇవన్నీ అమలు జరుగుతున్నాయని చెప్పారు. మోడీ ప్రభుత్వానికి కార్పొరేట్ భూతం పట్టుకుందని, దాన్ని వదిలించేందుకు మహిళాలోకం అమ్మోరు వేషాలు వేయకతప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నగర కన్వీనర్ ఎం.కామేశ్వరి, నాయకులు పి.మణి, ఎస్.అరుణ, మున్సిపల్ యూనియన్ నాయకులు కొండమ్మ, రాములమ్మ, లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

# ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్‌లు యథావిధిగా కొనసాగించాలి

- ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్ ఉపసంహరించుకోవాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన




పెద్దాపురం : ఎయిడెడ్ కళాశాలల్లో డిగ్రీ అడ్మిషన్‌లు నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్‌ను, ఎయిడెడ్ కళాశాలలకు ఎయిడ్ ఆపేస్తూ విడుదల చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో పెద్దాపురం మహారాణి కళాశాల ఎదుట ప్లెకార్డులతో ధర్నా నిర్వహించారు. జివో నెంబర్ 35 రద్దు చేయాలని, ఎయిడ్ కళాశాలలను రక్షించాలని, అడ్మిషన్‌లకు అనుమతి ఇవ్వాలని నినాదాలు చేసారు. ఈ ధర్నానుద్దేశించి ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యా సంస్థలను నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. ఎయిడ్ విద్యా సంస్థలకు ఎయిడ్ ను ఆపేస్తూ ప్రభుత్వం సర్క్యులర్ ఇవ్వడం చాలా దుర్మార్గమని అన్నారు. అనేక మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థానాల్లో ఎయిడెడ్ కళాశాల, పాఠశాలలు నిలిపాయని అన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను కాపాడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల తరువాత ఎయిడెడ్ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసే పనిలో పడ్డారని అన్నారు. జివో నెంబర్ 35 ద్వారా నాడు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో టీచర్, లెక్చరర్ పోస్టులు భర్తీ కాకుండా చంద్రబాబు చేస్తే, అసలు అడ్మిషన్‌లే జరపవద్దంటూ జగన్ మోహన్ రెడ్డి జివో ఇచ్చారని అన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందని అన్నారు. రాష్ట్రవ్యాపిత ఉద్యమానికి ఎస్.ఎఫ్.ఐ సన్నద్ధం అవుతుందని తెలిపారు. అన్ని రంగాల విద్యార్థులను, మేధావులను, వివిధ తరగతుల ప్రజలను కలుపుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొం దిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పసుపులేటి వీరబాబు, లలిత, కె. అమృత, దుర్గా ప్రసాద్, డి.శ్యామ్‌కుమార్, ఇ.ఉపేంద్ర, వినయ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



*విజయవాడ లో కాయల వెంకటరెడ్డి మారిటైం బోర్డు ఛైర్మన్ గా ప్రమాణ స్వీకారోత్సవం జరిగిన సందర్భంగా విశాఖపట్నం - కాకినాడ పెట్రోలియం, కెమికల్ & పెట్రోకెమికల్ ఇన్వెస్టుమెంట్ రీజియన్ ఛైర్ పర్సన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు విజయవాడలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతకాపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ చొక్కాకుల గోవిందా, అనిల్ పాల్గొన్నారు.*

# పర్యావరణ హిత పరిశ్రమల స్థాపనే లక్ష్యం

## : మంత్రి గౌతమ్‌రెడ్డి



అమరావతి: ప్రజల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఒక పాలసీ క్షేత్రస్థాయిలోకి ఏ స్థాయికి ఎలా వెళుతుందో, ఎలా అమలు జరుగుతుందో, దాన్ని ప్రభావాలను అంచనా వేయలన్న ఆలోచనల నుంచి పుట్టినదే 'గవర్నెన్స్ ల్యాబ్‌లు' అని పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తెలిపారు. కాన్ఫరెన్స్ ఆన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి 'వేగవంతమైన వృద్ధిలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడంలో గవర్నెన్స్ ల్యాబ్‌లు మైలురాళ్లు మారుతాయని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో పరిశ్రమలకు ఇస్తోన్న ప్రోత్సాహక విధానాలు, పద్ధతులు సరిగ్గా లేవని అన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ప్రోత్సాహకాల విషయంలో ఒక పద్ధతి, బడ్జెట్ ఉండాలన్నారు. ప్రోత్సాహాల విషయంలో కొన్ని సంస్కరణలు తీసుకువస్తే చాలా రాష్ట్రాలు ఊపిరి పీల్చుకుంటాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ లేని ప్రోత్సాహకాలే కాదు ఏదీ మంచిది కాదనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభిప్రాయమని తెలిపారు. మారే పరిస్థితులకు తగ్గట్లు ఎప్పటికప్పుడు మన ఆలోచనలను సరిదిద్దుకోవడమే అసలైన సంస్కరణ అని చెప్పారు. చైనాకు ప్రత్యామ్నాయం భారతదేశం మాత్రమేనని, పర్యావరణ హిత పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాలిచ్చే పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యమని వివరించారు. కరోనా సమయంలో పరిశ్రమలు ప్రభుత్వానికి అందించిన తోడ్పాటు మరవలేనిదని అన్నారు. మెడికల్ ఆక్సిజన్, బెడ్స్ వంటి సహా అనేక అంశాలలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కోవిడ్ 19 ప్రతి మనిషి మీద అనేక రకాలుగా ప్రభావం చూపిందని, భౌగోళిక, భౌతిక, వాతావరణ మార్పులకు కరోనా మేల్కొలుపని అన్నారు. అభివృద్ధి సంబంధిత శాఖలను ఒకే గొడుగు కిందకి తీసుకురావడంలో ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని చెప్పారు.

సంక్షేమం, సమాన అవకాశాలు, విలువైన విద్య, వైద్యం, విజ్ఞాన, పారిశ్రామిక వంటి అనేక రంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చిందని తెలిపారు. సరికొత్త మార్పులకు తగ్గట్లుగానే సరికొత్త విధానాలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని చెప్పారు.

# టీడీపీ ఇంఛార్జ్ కోరాడ రాజబాబు మీద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన టీడీపీ నాయకులు



భీమునిపట్నం : జీవీఎంసీ. భీమిలి జోన్ ఒకటవ డివిజన్ టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఒకటవ వార్డ్ టిడిపి అధ్యక్షులు తమ్మిన సూరిబాబు మాట్లాడుతూ నిన్న వైసిపి నాయకులు భీమిలి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కోరాడ రాజబాబు మీద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు కనీసం మున్సిపాలిటీ వార్డు స్థాయి నాయకులు కూడా కానీ వారు ఒక నియోజకవర్గ ఇన్చార్జ్ మీద విమర్శించడం వారి స్థాయి తగదని మా నాయకుడు మీలాగా కొండలు అమ్ముకొని బ్రతక లేదు అభివృద్ధి చేశారు మీ మంత్రి భీమిలి నియోజకవర్గంలో టూరిజం మంత్రిగా ఉండి ఏ మేరకు అభివృద్ధి చేశారో చర్చకు రావాలని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు గత ప్రభుత్వంలో గంటా శ్రీనివాసరావు చిల్ల పేట చెరువుకి నిధులు మంజూరు చేస్తే మీ మంత్రి టూరిజం మినిస్టర్ గా ఉండి రెండు సంవత్సరాలు పూర్తయిన అభివృద్ధి చేయలేదు ఇదేనా అభివృద్ధి అని వైసిపి నాయకు లను ప్రశ్నిస్తున్నా నని అన్నారు ఓట్ల కోసం వలస నాయకులు వస్తూ ఉంటారు పోతూ ఉంటారు వారికి భజన చేయడం మానుకోండి రెండవ వార్డ్ అధ్యక్షులు బడిగంట నీలకంఠ మాట్లాడుతూ మీ మంత్రి అభివృద్ధి అంటే జూట్ మిల్లు అమ్ముకోవడం మా అభివృద్ధి ఎంత మేరకు అభివృద్ధి చేశారు ఓపెన్ డిబేట్ కి రావలసిందిగా వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీ తరపున కోరుతున్నాను అని అన్నారు పార్లమెంటరీ జిల్లా సెక్రెటరీ పిట్టా సురేష్ మాట్లాడుతూ అభివృద్ధి అంటే అన్నా క్యాంటీన్ ఆపివేయడం టూరిజం మినిస్టర్ గా ఉంటూ టూరిజం నిధులు భీమిలి నియోజక వర్గానికి లేకపోయినా నియోజకవర్గంలో టూరిజం ఆస్తులను పడగొట్టడం మా అని వైసిపి నాయకులు ప్రశ్నించారు. ప్రధాన కార్యదర్శి వానపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాబలం ఉన్న స్థానిక బలమైన నాయకుడు రాజబాబు ఇండిపెండెంట్ గా పోటీ చేస్తే 26 వేల ఓట్లు వచ్చాయి వార్డు స్థాయి కానీ నాయకులు రాజబాబు మీద విమర్శించే స్థాయి మీకు లేదు మీలాగా కొండల్ అమ్ముకొని బ్రతక లేదు దమ్ముంటే మేము ఎన్నికలకు సిద్ధం పోటీకి వైసిపి సిద్ధమేనా మీ నాయకుడు వచ్చే ఎలక్షన్ కి భీమిలి నియోజకవర్గం లోని ఉంటారు పక్క నియోజకవర్గానికి వెళ్ళిపోతారో ముందు అడగండి అప్పుడు స్థానిక నాయకుల మీద విమర్శలు చేయండి భీమిలి టి డి పి ఇన్చార్జి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపితే తప్ప భీమిలి నియోజకవర్గం ఇంచార్జి ని చూసి వైసీపీ శ్రేణులు కలవరపడుతున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో లో పిల్లా రాజేష్ నరవ రామారావు సీనియర్ నాయకులు ఎక్స్ కౌన్సిలర్ దేవుళ్ళు ఎక్స్ కౌన్సిలర్ రాంబాబు ఎక్స్ కౌన్సిలర్ మాజీ ఫ్లోర్ లీడర్ చిలక నర్సింగ్ రావు ఎస్సి సెల్ అధ్యక్షులు సుబ్బారావు రెండో వార్డు సెక్రటరీ వెంకట్రావు ఎక్స్ కౌన్సిలర్ చాట్ల రమణ సీనియర్ నాయకులు జగన్నాథ గణేష్ యూత్ అధ్యక్షుడు వల్ల దుర్గారావు ఎస్ ఎల్ సెక్రటరీ తాటిపూడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా కనకమహాలక్ష్మికోఆపరేటివ్ బ్యాంకు 22వ మహాజన సభ

- ఖాతాదారుల ఆధరణతో మరింత ముందుకు
- ఛైర్మన్ పి.రఘునాధరావు

విశాఖపట్నం : ది కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 22వ మహాజన సభ బుధవారం అట్టహాసంగా జరిగింది. మద్దిలపాలెం సమీపంలోని ఎమ్ఆర్ సీ కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాధరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకొని ఫలితములను ఇచ్చే సమయంలో కరోనా వైరస్ విజృంభించి మన ఆర్థిక వ్యవస్థపై, సంస్థల పనితీరుపై విపరీత ప్రభావము చూపిందని విచారం వ్యక్తం చేశారు. అటి పరిస్థితులను తటుకొని మన బ్యాంకు ప్రస్తావన ఏడాదిలో మెరుగైన ఫలితములను సాధించిందని సభ్యులకు వివరించారు. ఖాతాదారుల ఆధారాభిమానాలతో ఇప్పటికి రాష్ట్రంలోని పలు జిల్లాలో 24 శాఖలను నెలకొల్పామని, రానున్న కాలంలో మరిన్ని శాఖల లను ఏర్పాటు చేయనున్నట్లు అధ్యక్షులు సభ్యులకు తెలియజేశారు. అనంతరం బ్యాంకు ముఖ్య నిర్వాహణాధికారి కె.శ్యామ్ కిశోర్ మహాసభ చర్చనీయ ర్చనియాంశములు సభ్యులకు చదివి వినిపించారు. 2020-21 సంవత్సరమునకు బ్యాంకు 22వ పరిపాలనా నివేదిక, ఆడిటు రిపోర్టు, బడ్జెట్ కు మించి అయిన అదనపు వ్యయము, ఆడిటు రిపోర్టు ప్రకారం 2020-21 సంవత్సరంలో బ్యాంకు సాధించిన నికరలాభము బైల్ నెం.44ను అనుసరించి పాలక వర్గము వారి సిఫారసుల మేరకు కేటాయింపులు చేయుట, 2020-21 సంవత్సరమునకు పాలక వర్గమువారి సిఫారసుల ప్రకారం బ్యాంకు బడ్జెటు అంశాలను సభ్యులచే ఆమోదింపచేశారు. 2020-2021 సంవత్సరంలో నిర్వహించిన బ్యాంకు ఆడిటర్లు బ్యాంకును 'ఏ' గ్రేడుగా శ్రేణికరించారని సభ్యులకు తెలపటంతో సభ్యులంతా హర్షద్వానాలతో సంతోషం వ్యక్తం చేశారు. బ్యాంకు రూ.713 కోట్ల డిపాజిట్లను కలిగి, రూ. 407 కోట్లు రుణాలను మంజూరు చేసి, రూ.8.16 కోట్ల నిఖర లాభంతో ముందుకు సాగుతుందన్నారు. ఆఖరిగా ఛైర్మన్ పి.రఘునాధరావు సభ్యుల వాటాదనానికి 2020-21కి గాను 15 శాతం డివిడెంట్ ను ప్రకటించడంతో సభ్యులంతా తమ హర్షద్వానాలతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యుల పిల్లలలో పదో తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులు 90 శాతం పైబడి మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతి రూ.5000 లను బ్యాంకు ఛైర్మన్ అందజేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు కె.రాంబాబు, డైరెక్టర్లు ఎం.రాఘవేంద్రరావు, జి.రామకృష్ణ, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, సి.పి.రామారావు, ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు, ఎ.వి.రమణ, డాక్టర్ వై.రమేష్, సిహెచ్.శ్రీనాథవెంకటేశ్వరరావు, డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, రేవు రత్నకుమారి, పి.హరీష్, బి.పుల్లయ్య, జి.రామకృష్ణ పస్రాలు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న ఛైర్మన్ పి.రఘునాధరావు



పాల్గొన్న ఖాతాదారులు

# అయ్యా.. మాకు మిగిలిందల్లా మా గోచీ గుడ్డ మాత్రమే

## దయచేసి వీటిని కూడా లాగేసుకోకండి

- మా ఆదివాసుల బాధలను అర్థం చేసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ....
గిరిజన సంఘం ఆధ్వర్యాన పెదబయలు మండలం లో గోచి గుడ్డలతో అర్ధనగ్న నిరసన





పాడేరు : ప్రపంచ ఆదివాసుల దినోత్సవం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి మా ఆదివాసులకు ఏమి ఇచ్చారో సమాధానం చెప్పాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ పృథ్వి రాజు ప్రశ్నించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఏడాది ప్రపంచఆదివాసుల దినోత్సవం రోజు అధికారులు ప్రజాప్రతినిధులు ఆదివాసులకు అందలంఎక్కించేఉపన్యాసాలతో సరి పెడుతున్నారని అయితే ఈ విషయంలో తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద తేడా ఏమీ లేదని విమర్శించారు ఆదివాసులకు కావలసింది పొగడ్తలు ఉపన్యాసాలు హామీలు కాదని నిజంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదివాసుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాల పైన గౌరవం ఉంటే రాజ్యాంగం లో పేర్కొనబడిన చట్టాలను హక్కులను 100% అమలు చేసినప్పుడే పాలకులపై ఆదివాసులకు గౌరవం ఉంటుందని అంతేకానీ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా తప్పుకోవడం సరైన విధానం కాదని అన్నారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మా హక్కులు చట్టాలు అమలు అవుతుందని దీర్ఘకాలికంగా ఉన్న మా సమస్యలుపరిష్కారమవుతాయని భావించి అత్యంత మెజారిటీతో ఓట్లు వేసి గెలిపించిన మా ఆదివాసుల కోసం ఏం చేశారో చెప్పాలని అన్నారు సంక్షేమ పథకాల బూచి చూపించి మా జీవోలను మాకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా నిర్వీర్యం చేస్తూ పోతుంటే ఆదివాసుల పక్షాన పోరాడాల్సింది పోయి చివరికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలకు ఆజ్యం పోసే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు గత ఏడాది ఏప్రిల్ 22 వ తారీఖున సుప్రీం కోర్టు జీవో 3 ఉద్యోగ రిజర్వేషన్ కొట్టివేసిన నాటి నుండి నేటి వరకు సుమారు 16 నెలలు గడుస్తున్నా ఆదివాసి ఎమ్మెల్యేలతో తోలు బొమ్మలాట ఆడిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూ ఉన్నారు తప్ప చిత్తశుద్ధితో గిరిజనుల హక్కుల చట్టాలు కాపాడలేక పోతున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు స్పందించి జీవో నెంబర్ 3 చట్టబద్ధం చేస్తూ వెంటనే గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీలకు ప్రత్యేక ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని 2008 డీఎస్సీ లో అర్హత సాధించిన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వాలని అలాగే యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేసేందుకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అటవీ హక్కుల చట్టం ,ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం తో పాటు పేస కమిటీ గ్రామ సభలు యధాతధంగా కొనసాగే విధంగా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సభ్యులు వికాస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏయూకు గ్రీన్ చాంపియన్ అవార్డు

## - కలెక్టర్ చేతుల మీదుగా స్వీకరించిన వర్సిటీ అధికారులు



ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ప్రతిష్టాత్మకమైన గ్రీన్ చాంపియన్ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖలోని మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ ఈ అవార్డును ఏయూకు ప్రకటించింది.అవార్డును బుధవారం ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్‌లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున నుంచి స్వీకరించారు. జాతీయ సేవా పథకం, వలంటీర్లు చేస్తున్న సేవలు గుర్తిస్తూ జిల్లాలో మెక్కలు నాటడం, వనరుల సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, సౌరవిద్యుత్‌ను ప్రోత్రహించడం, నీటి వృధాను అరికట్టడం, ప్లాస్టిక్ నియంత్రణ తదితర అంశాలపై చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించి అవార్డును ఏయూకు అందించింది. వర్సిటీకి అవార్డు లభించడం పట్ల వీసీ ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దీనిని స్పూర్తిగా తీసుకుంటూ మరింత ధీటుగా పనిచేయాలని సూచించారు. ఇటువంటి అవార్డు లభించడం మరింత బాధ్యతను పెంచుతాయన్నారు.

# ఔషధ పరిశోధనలలో రసాయన శాస్త్రం కీలకం

## గీతం వెబ్‌నార్ లో నిపుణులు

సాగర్‌నగర్ : ఔషధ పరిశోధనలలో రసాయన శాస్త్రం కీలక భూమిక వహిస్తోందని ముఖ్యంగా మానవాళికి రుగ్మతల నుంచి విముక్తి చేయడంలో రసాయన శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రసాయనిక శాస్త్ర విభాగం బుధవారం నిర్వహించిన వెబ్ నార్ లో నిపుణులు పేర్కొన్నారు. గీతం ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలకు ఒచిషధ పరిశ్రమలకు మధ్య పరస్పర పరిశోధనా సహకారం అవసరమన్నారు.

గీతం సైన్స్ కోర్సుల డీన్ ప్రొఫెసర్ ఎ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు అంతర్విభాగ పరిశోధనలు అవసరమన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్ చంద్ర బాబు గీతం సైన్స్ విభాగాలలో ఒచిషధ పరిశోధనలను వివరించారు. అరబిందో ఫార్మా రీసెర్చి సెంటర్ శాస్త్రవేత్త కె.చంద్రబాబు మాట్లాడుతూ గ్రీన్ కెటాలసిస్ ద్వారా ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలను నివారించ వచ్చునని, వృధా అరికట్టవచ్చునని, సురక్షితమైన రసాయనాలను తయారు చేయవచ్చునని తెలిపారు.

రాయపూర్ ఎన్ఐటి రసాయనశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.సంతోష్ మెడికల్ కెమిస్ట్రీలో న్యూక్లియై సైడ్ ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుతం 30 న్యూక్లియై సైడ్ ఔషధాలు మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయన్నారు.

కార్యక్రమానికి రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ జివిఆర్ శర్మ అధ్యక్షత వహించగా వెబ్ నార్ కార్యదర్శి డాక్టర్ వి.వందన, కన్వీనర్ డాక్టర్ కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 68వ వార్డులో జివిఎంసి మేయర్, కమిషనర్ పర్యటన



విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ డా. జి. సృజన ఆరవ జోన్ 68వ వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, వివేకానంద కాలనీ, పరిసర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ జి.వి.సాయి అనూషతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ సంయుక్తంగా మాట్లాడుతూ వివేకానంద కాలనీలో నూతనంగా నిర్మించుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కాలనీలోని మురిగు నీరు పోవుటకు మార్గం లేనందున మురుగునీరు పోవుటకు మార్గాన్ని అన్వేషించి కాలువలు నిర్మించుటకు అంచనాలు తయారుచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని తొలగించి స్థలయజమానికి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. వీధి దీపాలు సరిగా వెలగడం లేదని స్థానికులు తెలపగా వాటిని ఈరోజే వెలిగేలా చర్యలు చేపట్టాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎలెక్ట్రికల్) వారిని ఆదేశించారు. వీధులలో పందుల సంచారం అధికంగా ఉందని, వాటిని నిర్మూలించాలని శానిటరీ సూపర్వైజర్ ను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా చూడాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. అక్కిరెడ్డిపాలెం సెంటర్లో బహిరంగంగా చెత్త పడుతుండడం గమనించి శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక నెల జీతం ఆపాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కాలువలు మరమ్మతులకు గురయ్యాయని, బరియల్ గ్రౌండ్ కు ప్రహరీ గోడ నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ తెలుపగా, వాటిని పరిశీలించి ప్రతిపాదనలు తయారుచేయాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. అక్కిరెడ్డిపాలెం జంక్షన్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ వారు నీరు సరఫరా చేయడం వలన, చుట్టూ పక్కల వారికి ఇబ్బంది కలుగుతుందని స్థానికులు తెలపగా పరిశీలిస్తామని తెలిపారు. డోర్ టు డోర్ చెత్త నిర్వహణ, రోడ్లు ఊడ్చడం, త్రాగు నీరు సమయానికి వస్తున్నదీ లేనిదీ స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆరవ జోనల్ కమిషనర్ శ్రీధర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చిరంజీవి, రాయల్ బాబు, ప్రసాద్ బాబు, పి. వెంకట రావు, ఉప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళీ కృష్ణ, లక్ష్మోజి, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, వైసిపి నియోజవర్గ ఇంచార్జ్ దేవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్సార్ అవార్డుల ప్రదానోత్సవం వాయిదా

## అక్టోబరు లేదా నవంబరు నెలల్లో కార్యక్రమం నిర్వహణ

అమరావతి: వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. ఆగష్టు 13న నిర్వహించాల్సిన ఈకార్యక్రమాన్ని అక్టోబరు లేదా నవంబరు నెలల్లో నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. అవార్డు గ్రహీతల్లో పెద్ద వయస్సు ఉన్నవారు ఉండడటంతో పాటు, 150 మందికి మించి ఎక్కడా కూడా ప్రజలు గుమికూడదన్న వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు నేపథ్యంలో అవార్డుల కార్యక్రమాన్ని వాయిదావేస్తున్నట్లు పేర్కొంది.

అవార్డు గ్రహీతల వయస్సు, వారి ఆరోగ్యం.. అదే విధంగా వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని వాయిదా వేశామని, వచ్చే అక్టోబరు లేదా నవంబరు నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

# కళ్యాణ మండపాలు సబ్ లీజుకి ఇచ్చినట్లైతే చర్యలు తీసుకోండి

## - జివిఎంసి కమిషనర్ డా. జి.సృజన



విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో మరింత అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రస్తుతమున్న ఆదాయ వనరులను పెంపొందించడానికి తగు దృష్టి చారించాలని జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జివిఎంసి సమావేశ మందిరంలో డి.సి.(రెవెన్యూ) నల్లనయ్య, జోనల్ కమిషనర్లతోను, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్నులు, ఖాళీ జాగా పన్నులు, షాపింగ్ కాంప్లెక్సు, మార్కెట్లు, కళ్యాణ మండపాలు మొదలైన వాటి నుండి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయుటకు కృషి చేయాలని, కొత్తగా నిర్మించిన మరియు పాత ఇంటి విస్తీర్ణం యొక్క కొలతలు చేపట్టి పన్నులు వేయాలని, యజమనుదారులు తమ ఆస్తులను నివాస యోగ్యము నుండి వాణిజ్య వినియోగానికి మార్చి వినియోగిస్తున్న వాటిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ జాగాలపై సర్వే చేయాలని, పరిపాలనా కార్యదర్శులు ప్రతీ రోజూ మూడు గంటలు పాటు వారి సచివాలయ పరిధిలో పర్యటించి ఆస్తి పన్ను, నీటి పన్ను మరియు ఖాళీ స్థలం పన్ను వసూలుకు కృషి చేయాలన్నారు. కళ్యాణ మండపాలు తనిఖీ చేసి జివిఎంసి నిర్దేశించిన రేట్లు ప్రకారం నడుపుచున్నారా లేదా చూడాలని, కళ్యాణ మండపాలు పెళ్ళిళ్ళకి, శుభకార్యాలకు, దిన కార్యాలకు తప్ప వేరే వాటికి ఉపయోగించిన యెడల చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించాలని, అనధికారికంగా దుకాణాలను, కళ్యాణ మండపాలను గుత్తేదారుడు వేరే గుత్తేదారునికి అద్దెకు ఇచ్చిన యెడల, వాటిని వెంటనే ఖాళీ చేయించి, గుత్తేదారుని లీజును రద్దు చేయాలని ఆదేశించారు.

కోర్టు కేసులలో కోర్టుకు సమర్పించవలసిన వివరాలు జాగ్రత్తగా ఎం.ఎస్.సి. తో పరిశీలన చేయించి కోర్టుకు సమర్పించాలన్నారు. మున్సిపల్ సర్వీసెస్, అర్జీలు, స్పందన గ్రీవెన్సులో వచ్చిన అర్జీలను సకాలంలో పూర్తి చేయాలని, ఆస్తి పన్నుకి ఆధార లింకును వారం రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు.

# విశాఖ ఐఐపీఈ క్యాంపస్‌కు కోర్టు కేసు ఆటంకం

## రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు

న్యూఢిల్లీ : విశాఖపట్నంలో నెలకొల్పిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) క్యాంపస్ నిర్మాణానికి కోర్టు కేసు ఆటంకంగా మారిందని పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తెలి తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో 201 ఎకరాలను కేటాయించి 175 ఎకరాలను ఐఐపీఈకి స్వాధీనం చేసినట్లు చెప్పారు. మిగిలిన 26 ఎకరాలకు సబంధించి కోర్టులో కేసు ఉన్నందున ఐఐపీఈకి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా స్వాధీనం చేయలేదు. ఐఐపీఈకి అప్పగించిన భూమిలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కార్పొరేషన్ (ఏపీఐఐసీ) సరహద్దు గోడను నిర్మిస్తోందని మంత్రి చెప్పారు. ఆంధ్రా యూనివర్శిటీ లీజుపై ఇచ్చిన వసతిలోనే ప్రస్తుతం ఐఐపీఈ పని చేస్తోంది. ఐఐపీఈ క్యాంపస్ నిర్మాణం కోసం మూలధన వ్యయం కింద 655 కోట్ల రూపాయల కేటాయింపును పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. ఈ మొత్తంలో ఇప్పటి వరకు 184 కోట్ల రూపాయలు విడుదల చేయగా ఆంధ్రా యూనివర్శిటీ ఆవరణలోని తాత్కాలిక క్యాంపస్‌లో వసతి సౌకర్యం, శాశ్వత క్యాంపస్‌లో సరిహద్దు గోడ నిర్మాణం కోసం 51 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఐఐపీఈకి స్వాధీనం చేయడాన్ని బట్టి శాశ్వత క్యాంపస్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు.

**మూడేళ్ళలో ఓబీసీ స్కాలర్‌షిప్‌ల కోసం 3459 కోట్లు**

గడచిన మూడేళ్ళలో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద కేంద్ర ప్రభుత్వం 3,459 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి సుశ్రీ ప్రతిమా భౌమిక్ తెలిపారు. ఓబీసీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కేంద్ర ప్రభుత్వం చేసే ఖర్చు 20 శాతం తగ్గిన విషయం వాస్తవమేనా అంటూ రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ అలాంటిదేమీ లేదని చెప్పారు. 2017-18 నుంచి 2019-20 వరకు సుమారు కోటి 23 లక్షల మంది ఓబీసీ విద్యార్థులకు ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఓబీసీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల పంపిణీని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేస్తాయని తెలిపారు. అర్హులైన ఓబీసీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక సహాయానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధులను వెచ్చించి స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తుందని వివరించారు.



# ఏపీలో కొత్తగా 1,869 కేసులు.. 18 మరణాలు

## - బులెటిన్ విడుదల చేసిన వైద్యారోగ్య శాఖ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా 71,030 పరీక్షలు నిర్వహించగా.. 1,869 కేసులు నిర్ధారణ అయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 19,87,051 మంది వైరస్ బారినపడినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొవిడ్ వల్ల 18 మంది బాధితులు ప్రాణాలు కోల్పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య 13,582కి చేరింది. 24 గంటల వ్యవధిలో 2,316 మంది బాధితులు కోలుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య 19,55,052కి చేరినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 18,417 యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,53,82,763 నమూనాలను ఆరోగ్య శాఖ పరీక్షించింది. అత్యధికంగా చిత్తూరులో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టిన రవీంద్ర జడేజా, షకీబ్

దుబాయ్: టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టగా.. బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ టీ 20 ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపాడు. ముందుగా జడేజా విషయానికి వస్తే.. బుధవారం ఐసీసీ ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ విభాగంలో జడేజా(377 పాయింట్లు) రెండో స్థానానికి చేరుకున్నాడు. రెండో స్థానంలో ఉన్న బెన్‌స్టోక్స్(370)ను ఏడు పాయింట్లతో అధిగమించాడు. ఇంగ్లండ్‌తో ముగిసిన తొలి టెస్టులో జడేజా తొలి ఇన్నింగ్స్‌లో అర్థ సెంచరీతో ఆకట్టుకున్నాడు. భారత్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంలో కీలక పాత్ర పోషించిన జడేజా నెంబర్ వన్ స్థానానికి మరింత చేరువయ్యాడు. ఇక విండీస్ ఆల్‌రౌండర్ జాసన్ హెూల్డర్ 384 పాయింట్లతో తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌తో మరో నాలుగు టెస్టులు మిగిలి ఉండడంతో జడేజా మంచి ప్రదర్శన కనబరిస్తే త్వరలోనే నెంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఇక టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కేన్ విలియమ్సన్(901), స్టీవ్ స్మిత్(891), మార్నస్ లబుషేన్(878) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com